teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

## మాజీ సీఎం కేసీఆర్‌కు అనారోగ్యం



యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెసిఆర్
ప్రత్యేక వైద్య బృందం నేతృత్వంలో ఆరోగ్య పరీక్షలు

ములుగు | సంపుటి : 04 | సంచిక : 30 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 4 జూలై 2025 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.



# తెలంగాణకు భారీ వర్ష సూచన

### బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి ప్రభావం



- ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు
- హైదరాబాద్‌తో పాటు 19 జిల్లాలకు మోస్తరు వర్షాలు
- క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు
- ఉత్తరాంధ్రలోనూ కొన్ని చోట్ల భారీ వర్షాలకు అవకాశం

తెలంగాణ బ్యూరో, జులై 03 (తీన్మార్ న్యూస్): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఉపరితల ద్రోణి కారణంగా జూలై ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే నేడు తెలంగాణలోని 19 జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఈ జిల్లాలతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్టు పేర్కొంది. ఏపీలోని ఉత్తరాంధ్రలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు భారత వాతారవరణ విభాగం వెల్లడించింది.

## తలసరి జీఎస్డీపీలో తెలంగాణ టాప్ 5




- భారత్‌లో తలసరి స్థూల దేశీయోత్పత్తి సగటు $2,677
- బీజేపీయేతర రాష్ట్రాల్లో అద్భుత అభివృద్ధి
- నివేదికపై రాజకీయ నిపుణుల విశ్లేషణ

న్యూ ఢిల్లీ, జులై 03 (తీన్మార్ న్యూస్): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్రాల తలసరి స్థూల దేశీయోత్పత్తి వివరాలను వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అగ్రస్థానంలో నిలవగా తెలంగాణ టాప్ 5th ప్లేస్ ఉంది. ఈ నివేదిక ప్రకారం, భారతదేశంలో తలసరి స్థూల

మిగతా 2 లో

## సిగాచిలో పేలుడు నేపథ్యంలో రంగంలోకి దర్యాప్తు కమిటీ

- ప్రమాద కారణాలు, భద్రతా నిబంధనల ఉల్లంఘనపై ఆరా
- నెల రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్న కమిటీ



సంగారెడ్డి, జులై 03 (తీన్మార్ న్యూస్): తీవ్ర విషాదం నింపిన సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనపై నిపుణుల కమిటీ రంగంలోకి దిగింది. ఈ పేలుడు ఘటనపై అధ్యయం చేసి నివేదిక ఇవ్వాలని నలుగురు నిపుణులతో కూడిన కమిటీని బుధవారం ప్రభుత్వం


మిగతా 2 లో



## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్‌రావు

జూలై 05న బాధ్యతల స్వీకారం

.. వివరాలు 2లో




## తెలంగాణ గ్రూప్ 1 పిటిషన్లపై హైకోర్టులో విచారణ

- పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్యలో తేడా లేదు
- ఒకే కేంద్రంలోని వారే ఎక్కువ మంది ఎంపికయ్యారనేది అబద్ధం
- టీజీపీఎస్సీ తరపున న్యాయవాది ఎస్.నిరంజన్ వాదనలు

.. వివరాలు 2లో

## పాకిస్తాన్‌పై ఆపరేషన్ సింధూర్ ప్రభావం

- నూర్ ఖాన్ బేస్‌పై బ్రహ్మోస్ దాడిని అంగీకరించిన పాక్
- 45 సెకన్లలోనే క్షిపణిని అంచనా వేయాల్సి వచ్చిందని వెల్లడి
- ట్రంప్ మధ్యవర్తిత్వంతో అణు యుద్ధం నివారణ
- పాక్ అధికారి సంచలన వ్యాఖ్యలు

02






## కృష్ణా నదికి భారీ వరద

### శ్రీశైలంకు పోటెత్తుతున్న జలాలు

- జూరాల నుండి శ్రీశైలంకు 65,159 క్యూసెక్కుల ప్రవాహం
- శ్రీశైలం ప్రస్తుత నీటిమట్టం 875.70 అడుగులు
- విద్యుత్ ఉత్పత్తికి రెండు రాష్ట్రాల వినియోగం 58,578 క్యూసెక్కులు
- సుంకేశుల, హంద్రీనీవా నుండి ప్రవాహం లేదు.. అధికారుల నిత్య నిఘా

.. వివరాలు 2లో

## రాష్ట్ర ప్రజలకు రాహుల్ చేసిన ద్రోహం తీవ్రరూపం దాల్చింది

- బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై రాహుల్ గాంధీ మౌనం
- ఇది కుట్రపూరితమే.. కేటీఆర్ ఆరోపణలు



02

## అంగన్ వాడీ హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు

- పదోన్నతి గరిష్ఠ వయోపరిమితి 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంపు
- ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడి

02



## హైదరాబాద్ ను దేశంలోనే వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దాలి



- మా ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది : సీఎం రేవంత్
- పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రం ముందుంది

రంగారెడ్డి, జులై 03 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ ను దేశంలోనే వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దాలని మా ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పెట్టుబడులను

మిగతా 2 లో



02

## బోనాలు 2025 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దుద్దిళ్ల

టీటా సంస్కృతి కదలిక ఐటీ కారిడార్‌లో నిలబెట్టడం అభినందనీయం

## పెన్షన్ పెంపును అమలు చేయాలని డిమాండ్

ఆగస్టు 13న మహాగర్జన పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు మంద కృష్ణ మాదిగ వెల్లడి



.. వివరాలు 2లో

# తలసరి జీఎస్డీపీలో తెలంగాణ టాప్ 5

మొదటి పేజీ తరువాయి

దేశీయోత్పత్తి సగటు %వి%2,677 (సుమారు ₹2.24 లక్షలు)గా ఉంది. అయితే బీజేపీయేతర రాష్ట్రాల్లో అభివృద్ధి బ్రహ్మాండంగా ఉందంటూ పలువురు రాజకీయ నిపుణులు మరోసారి ఈ విషయాన్ని గుర్తు చేస్తున్నారు.



**టాప్ 10 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల తలసరి జీఎస్డీపీ:**

సిక్కిం - $8,691 (సుమారు ₹7.28 లక్షలు): ఈశాన్య రాష్ట్రం తన పర్యాటక రంగం, జలవిద్యుత్, మరియు సేంద్రీయ వ్యవసాయంతో అత్యధిక తలసరి జీఎస్డీపీని కలిగి ఉంది.

గోవా - $8,370 (సుమారు ₹7.01 లక్షలు): పర్యాటకం, ఓడరేవు కార్యకలాపాలు, మరియు గనుల రంగం గోవా ఆర్థిక వృద్ధికి దోహదపడ్డాయి.

ఢిల్లీ - $6,690 (సుమారు ₹5.61 లక్షలు): జాతీయ రాజధానిగా, ఢిల్లీ సేవా రంగం, వాణిజ్య కేంద్రాలు, మరియు పరిపాలనా కార్యకలాపాలతో ఆర్థికంగా బలంగా ఉంది.

చండీగఢ్ - $5,905 (సుమారు ₹4.95 లక్షలు): ఈ కేంద్రపాలిత ప్రాంతం తన సుపరిపాలన, విద్య, మరియు ఐటీ రంగంతో అధిక తలసరి జీఎస్డీపీని సాధించింది.

తెలంగాణ - $4,745 (సుమారు ₹3.98 లక్షలు): ఐటీ, ఫార్మా, మరియు సేవా రంగాలతో తెలంగాణ గణనీయమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది.

కర్నాటక - $4,637 (సుమారు ₹3.89 లక్షలు): బెంగళూరు కేంద్రంగా ఐటీ రంగం, తయారీ, మరియు వ్యవసాయం కర్నాటక ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తున్నాయి.

హరియాణా - $4,581 (సుమారు ₹3.84 లక్షలు): గురుగ్రామ్‌లోని కార్పొరేట్ హబ్‌లు, తయారీ, మరియు వ్యవసాయం హరియాణా ఆర్థిక బలానికి కారణం.

తమిళనాడు - $4,323 (సుమారు ₹3.62 లక్షలు): ఆటోమొబైల్, టెక్స్‌టైల్, మరియు ఐటీ రంగాలు తమిళనాడు ఆర్థిక వృద్ధిని పెంచాయి.

గుజరాత్ - $4,306 (సుమారు ₹3.61 లక్షలు): రసాయనాలు, ఓడరేవు కార్యకలాపాలు, మరియు తయారీ రంగం గుజరాత్ ఆర్థిక శక్తికి దోహదపడ్డాయి.

పుదుచ్చేరి - $4,231 (సుమారు ₹3.54 లక్షలు): పర్యాటకం, చిన్న-స్థాయి పరిశ్రమలు, మరియు సేవా రంగం ఈ కేంద్రపాలిత ప్రాంతం ఆర్థిక వృద్ధికి కారణం.

టాప్ 10 లో ఉన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తక్కువ జనాభా, బలమైన సేవా రంగం, పారిశ్రామిక అభివృద్ధి, సమర్థవంతమైన ఆర్థిక వ్యవస్థల కారణంగా జాతీయ సగటు ($2,677) కంటే గణనీయంగా ఎక్కువ తలసరి జీఎస్డీపీని సాధించాయి.

## అంగన్ వాడీ హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు



హైదరాబాద్, జులై 03 (తీన్మార్ న్యూస్): అంగన్ వాడీ హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. అంగన్ వాడీ టీచర్లుగా పదొన్నతి పొందే గరిష్ట వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంబంధిత ఫైల్‌పై గురువారం సంతకం చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల సుమారు 4,322 మంది అంగన్ వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి పొందే అవకాశం ఏర్పడనుంది. గతంలో 45 ఏళ్లు దాటిన తర్వాత ప్రమోషన్ కోసం అవకాశాలు లేకపోయినా, ఇప్పుడు వారికీ మళ్ళీ అవకాశం లభించనుంది.

**ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో**

గరిష్ట వయోపరిమితిని పెంచాలని అంగన్ వాడీ హెల్పర్ యూనియన్ల నుంచి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు వచ్చాయి. దీంతో ఈ విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సంబంధింత అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. అయితే అర్హతలు ఉన్న 50 ఏళ్ల లోపు హెల్పర్లకు టీచర్ పదోన్నతి ఇవ్వడంలో ఎలాంటి అడ్డంకులు లేవని సదరు అధికారులు నివేదిక సమర్పించారు. ఇటీవలే అంగన్ వాడీ టీచర్ల రిటైర్మెంట్ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో 50 ఏళ్ల వయస్సులో టీచర్ గా పదోన్నతి పొందే హెల్పర్లు మరో 15 ఏళ్లు విధులు నిర్వర్తించవచ్చని సూచించారు. 45 సంవత్సరాల వయస్సు దాటిన అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వడంలో ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు స్పష్టం చేయడంతో సంబంధింత ఫైల్ పై మంత్రి సీతక్క సంతకం చేయగా ఇందుకు సంబంధించిన అధాకిరక ఉత్తర్వులు త్వరలోనే వెల్లడి కానున్నాయ.

## కృష్ణా నదికి భారీ వరద

తెలంగాణ బ్యూరో, జులై 03 (తీన్మార్ న్యూస్): ఎగువన ఉన్న ఆల్మట్టి, జూరాల ప్రాజెక్టుల నుండి కృష్ణా నదిలో భారీగా వరద ప్రవహిస్తూ, దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. జూరాల ప్రాజెక్టు నుండి వరద ప్రవాహం గంట గంటకూ ఉధృతమవుతుండటంతో, అక్కడి నుండి 65159 క్యూసెక్కుల నీరు శ్రీశైలం వైపు చేరుతోందని అధికారులు విడుదల చేసిన వరద ప్రభావ బులిటెన్‌లో పేర్కొన్నారు. శ్రీశైలం జలాశయానికి గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం అది 875.70 అడుగులకు చేరింది. జూరాల ప్రాజెక్టు నుండి 32034 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండగా, స్పిల్‌వే ద్వారా 33125 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. సుంకేశుల, హంద్రీనీవా ప్రాజెక్టుల నుండి ప్రస్తుతం ఎలాంటి ప్రవాహం లేదు. ఇక విద్యుత్ ఉత్పత్తి విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్‌లోని కుడి గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 35315 క్యూసెక్కులు, తెలంగాణ రాష్ట్ర ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 23263 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఈ రెండు రాష్ట్రాలూ కలిపి 58578 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి కోసం ఉపయోగిస్తున్నారు. వరద ప్రవాహం ఇప్పటికీ కొనసాగుతుండటంతో, అధికారులు నిత్యనిరీక్షణలో ఉన్నారు.

## పెన్షన్ పెంపును అమలు చేయాలని డిమాండ్



హైదరాబాద్, జులై 03 (తీన్మార్ న్యూస్): వికలాంగులు, ఆసరా పెన్షన్ దారుల కోసం ప్రభుత్వం హామీ ఇచ్చిన పెన్షన్ పెంపును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, వచ్చే ఆగస్టు 13న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో "మహాగర్జన" పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ వెల్లడించారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లు పెంచాల్సిందే. లక్షల మంది ఆసరా, వికలాంగుల పెన్షనుదారులను సమీకరిస్తాం. మహాగర్జనతో హైదరాబాద్ రహదారులను దిగ్బంధిస్తాం. ఆగస్టు 15 నుంచి 20 మధ్యలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. అందులోపే వికలాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం," అన్నారు. మంద కృష్ణ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. "ఇంకా మొండితనం కొనసాగితే, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం" అని పేర్కొన్నారు. మహాగర్జన ద్వారా తమ ఆవేదనను రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంగా తెలియజేస్తామని, తమ హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## పాకిస్తాన్‌పై "ఆపరేషన్ సింధూర్" ప్రభావం




న్యూ ఢిల్లీ, జులై 03 (తీన్మార్ న్యూస్): భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్ గుండెలపై చేసిన గాయాలు వారాలు గడుస్తున్నా అక్కడి అధికారులను వెంటాడుతూనే ఉన్నాయి. మిలియటరీ ఉద్రిక్తతల సమయంలో భారత్ తన బ్రహ్మోస్ మిసైల్ ఉపయోగించి పాకిస్థాన్ లోని నూర్‌ఖాన్ బేస్ పై దాడి చేసినట్లు అక్కడి సీనియర్ ప్రభుత్వ అధికారి తాజాగా అంగీకరించారు. నాలుగు రోజులు కొనసాగిన పరస్పర దాడుల్లో ఇది చాలా కీలకమైన మలుపుగా మారింది. ఈ దాడి పూర్తి స్థాయి అణు దాడికి దారితీస్తుందేమో అని వారు భయబడినట్లు తేలింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రయత్నాలు ఇండియా పాక్ మధ్య అణు యుద్ధాన్ని నివారించాయని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పెషల్ అసిస్టెంట్ రాణా సనాఉల్లా ఖాన్ చెప్పారు. భారత్ నూర్ ఖాన్ బేస్ మీద బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించినప్పుడు పాక్ ప్రభుత్వం దానిని అనలైజ్ చేసేందుకు కేవలం 30 నుంచి 45 సెకన్ల సమయం మాత్రమే ఉందని చెప్పారు. మిసైల్ ఏదైనా అణు బాంబును కలిగి ఉందా అని నిర్ధారించుకోవాటికి అర నిమిషం సమయమే మిగిలిందన్నారు. ఈ దాడి పాకిస్థాన్ వ్యాప్తంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తించింది. భారత్ అణు ఆయుధాలను మ్మొదట ప్రయోగించకుండా బాధ్యతగా వ్యవహరిస్తుందని తెలిసినప్పటికీ తమకు తక్కువ సమయం ఉండటంతో అది అణు వార్ హెడ్ అని అపార్థం చేసుకునే ప్రమాదం ఉందన్నారు. ఇది పరోక్షంగా అణు యుద్ధానికి దారితీసేదని చెప్పారు. ఒకవేళ అణు దాడి జరిగితే ఎంత ప్రమాదకరమో ఊహించటానికి భయంగా ఉందని ఖాన్ చెప్పారు. ఆ సమయంలోనే యుద్ధాన్ని నివారించటానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలకంగా వ్యవహరించారంటూ చెప్పుకొచ్చారు. భారత్ మాత్రం పాక్ డీజీఎంఓ కాల్ చేసి కాల్పుల విరమణను కోరిందని చెబుతుంటే ఖాన్ మాత్రం ట్రంప్ లేకుంటే ప్రపంచం ప్రమాదంలో పడేదంటూ పాత కథ మళ్లీ చెప్పారు. దీనికి ముందు పాక్ ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్ ట్రంప్ కి శాంతి దూతగా నోబెల్ బహుమతి ఇవ్వాలని ఆఫర్ చేశారు. పాక్ రక్షణకు అత్యంత కీలకమైన ఎయిర్ బేస్ నూర్ ఖాన్ రాజధాని ఇస్లామాబాద్ కి కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న సంగతి తెలిసిందే. అలాగే అణు కార్యకలాపాల పర్యవేక్షణ, భద్రపరిచే కార్యాలయానికి ఇది అత్యంత సమీపంలో ఉండటం కూడా పాకిస్థాన్ కి చెమటలు పట్టించింది.

## హైదరాబాద్ ను దేశంలోనే వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దాలి

మొదటి పేజీ తరువాయి



ఆకర్షించడంలో రాష్ట్రం ముందుందని హైదరాబాద్ కు దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదని ప్రపంచ నగరాలతోనే మా పోటీ అన్నారు. ప్రపంచంతో పోటీపడే నైపుణ్యత మన యువతలో ఉందని నేను నా సహచర మంత్రులు భావిస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఇండస్ట్రియల్ పార్క్ లో గురువారం మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్ ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కులీ కుతుబ్ షాయిలు హైదరాబాద్ నగరాన్ని నిర్మిస్తే నిజాం నవాబులు హైదరాబాద్-సికింద్రబాద్ జంట నగరాలను నిర్మించారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి కలిసి సైబరాబాద్ అనే మూడో నగరాన్ని నిర్మించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో ఫోర్త్ సిటీని ప్రపంచానికి అందించబోతోందన్నారు. రాబోయే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెట్ ను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మహేశ్వరం నియోర్గం పరిధిలో గొప్ప నగరాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం సింగపూర్ తో పాటు ఇతర దేశాల కన్సల్టెన్సీ సంస్థలు నిరంతరం పనిచేస్తున్నాయని సీఎం చెప్పారు. మన దేశంలోనే ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ లెజెండ్ గా ఉంది. ఇప్పుడు గోల్ట్ లో కూడా హైదరాబాద్ లెజండ్ గా అవతరించబోతున్నదన్నారు. ఒక్కోరంగంలో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించడంలో మా ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా పెట్టుబడుల విషయాల్లో ప్రభుత్వ పాలసీలు మాత్రం మారలేదని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు పెట్టుబడిదారులకు రక్షణ కల్పించి వారి వ్యాపారం లాభదాయకంగా జరిగేలా రాయితీలతో పాటు సహాయ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.



## మాజీ సీఎం కేసీఆర్‌కు అనారోగ్యం

హైదరాబాద్, జులై 03 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యం పాలయ్యారు. తీవ్ర సీజనల్ జ్వరం బారిన పడటంతో కేసీఆర్ ను సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రత్యేక వైద్య బృందం నేతృత్వంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా కేసీఆర్ అనారోగ్యంపై గులాబీ పార్టీ నాయకులు, శ్రేణులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. యశోద ఆసుపత్రికి భారీగా నాయకులు చేరుకునే అవకాశం ఉంది.



## సిగాచిలో పేలుడు నేపథ్యంలో రంగంలోకి దర్యాప్తు కమిటీ

మొదటి పేజీ తరువాయి

ప్రకటించిన సంగతి తెలిసిదే. ఈ మేరకు గురువారం కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, సభ్యులు ప్రతాప్, సూర్యనారాయణ, సంతోష్ పేలుడు సంభవించిన పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. అక్కడ తాజా పరిస్థితులను పరిశీలించారు. అయితే సిగాచి పరిశ్రమలో ఈ ప్రమాదం జరగడానికి గల కారణాలు విశ్లేషించడంతో పాటు కార్మికుల భద్రతకు నిబంధనలు పాటించారా? లేదా అనే విషయాలపై ఆరా తీయనున్నది. ఈ పేలుడుకు గల కారణాలు ఏంటి, ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ నెల రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నది.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్‌రావు

### జూలై 05న బాధ్యతల స్వీకారం

హైదరాబాద్, జులై 03 (తీన్మార్ న్యూస్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. శనివారం అసెంబ్లీ ముందున్న గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించి ఉదయం పది గంటలకు బీజేపీ స్టేట్ చీఫ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా, ఇటీవల తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నిక అయిన విషయం తెలిసిందే. కొన్ని అనూహ్య పరిణామాల మధ్య హైకమాండ్ ఆదేశాల మేరకు రామచందర్‌రావును అధ్యక్షుడిగా ఏకగ్రీవం చేశారు. అయితే, ఎమ్మెల్యే రాజా సింగ్ నామినేషన్ వేయడానికి ప్రయత్నించినప్పటికీ కౌన్సిల్ సభ్యుల బలం లేకపోవడంతో ఆయన నామినేషన్ స్వీకరించలేదు. దీంతో అసంతృప్తితో ఉన్న ఆయన రాజీనామా చేసి పార్టీకి గుడ్ బై చెప్పారు. అలాగే అధ్యక్ష రేసులో ఉన్న ఎంపీ ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, బండి సంజయ్‌లు హైకమాండ్ ఆదేశాల మేరకు రామచందర్‌రావు మద్దతు ప్రకటించారు. దీంతో రామందర్‌రావు కిషన్ రెడ్డి స్థానంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

## తెలంగాణ గ్రూప్ 1 పిటిషన్లపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్, జులై 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ గ్రూప్ 1 పిటిషన్లపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్స్ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని టీజీపీఎస్సీ తరపున న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి తన వాదనలు వినిపించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్యలో ఎలాంటి తేడా లేదన్నారు. కోఠిలోని ఓ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన వారే ఎక్కువ మంది ఎంపిక అయ్యారనేది అబద్ధమని, అక్కడున్న 2 కేంద్రాల్లో 1500 మంది మహిళా అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాశారని, మహిళలకు కేటాయించడం కేవలం అక్కడున్న ఫెసిలిటీస్ ను దృష్టిలో పెట్టుకొని మాత్రమేనని కోర్టుకు స్పష్టం చేశారు. ఉద్యోగానికి ఎంపిక కాలేదని ఏవేవో అనుమానాలు పెట్టుకోవడం తప్ప పిటిషనర్స్ ఆరోపణల్లో నిజం లేదన్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియం అభ్యర్థుల పట్ల కమిషన్ ఎలాంటి వివక్ష చూపించలేదని, వారు సమాధానం రాసిన అంశాలను బట్టి నిపుణులు మార్కులు వేశారని కోర్టుకు తెలిపారు. కాగా కమిషన్ నిరవహించిన గ్రూప్ 1 మెయిన్స్ లొ తెలుగు మీడియం అభ్యర్థుల సమాధాన పత్రాలు సరిగ్గా వాల్యుయేషన్ చేయలేదని, కోఠిలోని ఓ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన అభ్యర్థులే ఎక్కువమంది ఎంపిక అయ్యారని కొంతమంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్స్ దాఖలు చేశారు. మెయిన్స్ పరీక్షను పూర్తిగా రద్దు చేసి, మళ్ళీ పరీక్ష నిర్వహించాలని పిటిషన్ లో పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు రాహుల్ చేసిన ద్రోహం తీవ్రరూపం దాల్చింది

హైదరాబాద్, జులై 03 (తీన్మార్ న్యూస్): బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం గురించి రాహుల్ గాంధీ మౌనం వహించడం కుట్రపూరితమే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేటీఆర్ తన సోషల్ మీడియా పోస్టులో లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న తరుణంలో రాహుల్ రాష్ట్ర ప్రజలకు చేసిన ద్రోహం తీవ్రరూపం దాల్చిందని పేర్కొన్నారు. తెలంగాణకు సంబంధించిన పెద్ద సమస్యలను, 2014 విభజన చట్టంలో నెరవేరని హామీలను రాహుల్ గాంధీ ఒక్కసారి కూడా లోక్ సభలో లేవనెత్తలేదని అన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులకు జాతీయ హోదా అయినా, బయ్యారం ఉక్కు కర్మాగారం గురించి అయినా ఒక్కసారి కూడా ఆయన లేవనెత్తలేదని ఆరోపించారు. గోదావరి నీటి హక్కులను మళ్లించే ప్రమాదం ఉన్న ఏపీలోని బనకచర్ల ప్రాజెక్టుపై కూడా ఆయన మౌనం వహించడం కుట్రపూరితమే అని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 420 వాగ్దాగాలను ప్రకటించిన తరవాత రాహుల్ గాంధీ నీడలా మసకబారిపోయారని, తెలంగాణ ఆకాంక్షలు నీరుగారిపోతుంటే కాంగ్రెస్ అధికారం మత్తులో మునిగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బోనాలు 2025 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దుద్దిళ్ల

### టీటా సంస్కృతి కదలిక ఐటీ కారిడార్‌లో నిలబెట్టడం అభినందనీయం



హైదరాబాద్, జులై 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సాంప్రదా యాలకు ఆధునిక తను మేళవిస్తూ, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టీహబ్ వేదికగా తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) బోనాలు 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటా గ్లోబల్ అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాలా, బోనాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ ఏడాది ఐటీ బోనాలు వేడుకలు, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ భాగస్వామ్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సందీప్ మక్తాలా, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణకి సంస్కృతి పరిరక్షణలో అందిస్తున్న అప్రతిహత మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆషాఢ మాసం రెండో ఆదివారం, జూలై 6న జరగనున్న ఈ ఐటీ బోనాలు వేడుకల్లో గతంలో పాల్గొన్న తన అనుభవాలను గుర్తు చేసుకున్న మంత్రి శ్రీధర్ బాబు వాతావరణంలో సంప్రదాయాన్ని నిలిపే ఈ వేడుకలు ఎంతో గొప్పవని, టీటా ద్వారా ఈ సంస్కృతి ఆధారిత కదలిక ఐటీ కారిడార్‌లో నిలబెట్టడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ సంవత్సరం వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా, శిల్పకళా వేదిక నుంచి చిన్న పెద్దమ్మ దేవస్థానానికి భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఊరేగింపు ప్రారంభానికి ముందు, సందీప్ మక్తాలా కుటుంబం, అమ్మవారికి చీర సారెలతో, ఒడి బియ్యాన్ని సమర్పించి ప్రత్యేక సంప్రదాయ పూజ నిర్వహిస్తారు. ఇన్ఫోసిస్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్ సహా ప్రముఖ ఐటీ కంపెనీల నుండి వచ్చిన 21 బోనాలు, తమ తమ కార్యాలయాల నుండి బయలుదేరి శిల్పకళా వేదిక వద్ద కలుస్తాయి. అక్కడి నుండి ఊరేగింపుగా చిన్న పెద్దమ్మ దేవస్థానానికి ప్రదక్షిణగా సాగుతాయి. భక్తితో పాటు సంగీతం, సంప్రదాయం, ఐక్యత నిండిన ఈ ప్రదర్శన ఉద్యోగులకు ఓ సాంస్కృతిక పండుగను రుచి చూపించనుంది. పోతురాజులు, శివసత్తులు, దప్పులు, ఒగ్గు డోలు, గుస్సాడి తదితర ప్రజాకళల బృందాలు సాంప్రదాయ ప్రదర్శనలు ఇస్తాయి. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ జానపద కళలకు అంతర్జాతీయ ఐటీ వేదికపై గుర్తింపు లభిస్తుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి వాకిటీ, శ్రీనివాస్ మారి, హరిని గోలీ, యామిని, మనసా, దినేష్, కీర్తన్, ప్రణీత్, వెంకట్ బూరా వంటి టీటా బోనాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వర్ష విపత్తును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధం

**ప్రజల అప్రమత్తంగా అధికారుల సూచనలు పాటించాలి**

**జిల్లా వ్యాప్తంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**




ములుగు జిల్లా, జూలై 03 (తీన్మార్ న్యూస్): జూలై, ఆగస్టు మాసాలలో జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, జిల్లా ప్రజల అప్రమత్తంగా ఉంటూ అధికారులు సూచనలు సలహాలను పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో 61 గ్రామాలు వర్ధముక్కు గురి అయ్యే అవకాశం ఉందని, 970 శితలవస్థ లో ఉన్న ఇండ్ల కుటుంబాల యజమానులను అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగిందని అన్నారు. జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు భారీ వర్షాల సందర్భంగా వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, ప్రమాద స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 800 చెరువులు ఉండగా 13 చెరువుల పెద్దవి ఉన్నాయని, నీటి ప్రాణంతో నిండా చెరువులను ముందస్తుగా గమనించడం జరుగుతుందని వివరించారు. ప్రస్తుత వర్షాకాలంలో లోతట్టు గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలో ఉండే పరిస్థితి ఉండడంతో వారికి సరిపడా నిత్యవసర సరుకులను ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంచుతున్నామని, అధికారులు మొదటి హెచ్చరిక చేయగానే ఆయా గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో ఫ్లడ్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి 24 గంటల పాటు అధికారులు విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశామని, ప్రమాద పరిస్థితిలో ఉన్న 30 గ్రామాల ప్రజలకు రిస్క్ జాకెట్లను పంపిణీ చేయడంతో పాటు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచి నాలుగు బోట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను పర్యటించే పర్యాటకులు నీటి ప్రవాహాలలో దిగవద్దని, దట్టమైన అడవి ప్రాంతాలకు వెళ్ళవద్దని అన్నారు. వర్షపు విపత్తుని ఎదుర్కోవడానికి పోలీస్, అగ్నిమాపక సిబ్బంది, వైద్యశాఖ, విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశామని, లోతట్టు ప్రాంతాల లోని గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైద్య అధికారులకు తెలిపారు. 58 పునరావాస కేంద్రాలలో 15 వేల మంది ఉండే విధంగా ఏర్పాటు చేశామని, ప్రస్తుత వర్షాకాలంన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. ఈ పాత్రికేయుల సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం. డి. రఫిక్, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేట పాఠశాలలో నూతనంగా 35 మంది విద్యార్థులు ప్రవేశం



గోరికొత్తపల్లి, జులై 03 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండలం జగ్గయ్యపేట గ్రామంలో బడిబాటలో భాగంగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ప్రభుత్వము ఇస్తున్న సదుపాయాలను, నాణ్యమైన విద్య వంటి అంశాలను ప్రజల మధ్యకు సమర్థవంతంగా తీసుకొని అవగాహన కల్పించడం వలన ఉపాధ్యాయుల కృషి ఫలితంగా గత సంవత్సరములో పదవ తరగతిలో 100% ఫలితాలు సాధించడం జరిగింది. ఈ విధమైన కృషి ఫలితంగా పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రవేశం పొందడం జరిగింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అనుభవం కలిగిన, సమర్థులైన ఉపాధ్యాయులచే ఉత్తమమైన విద్య ప్రమాణాలతో నాణ్యమైన బోధన, గ్రామ ప్రజలకు విశ్వాసము కలిగినందున, ప్రైవేటు పాఠశాల నుండి మరియు గ్రామ దూర ప్రాంతాలలో చదువుతున్న గురుకుల విద్యార్థుల సైతం జగ్గయ్యపేట ప్రభుత్వ పాఠశాలకు 35 మంది రావడం జరిగినది. విద్యార్థులు ఈ సంవత్సరంలో ప్రవేశం పొందడం సంతృప్తినిచ్చిందని ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ తెలియజేశారు. తల్లిదండ్రుల విశ్వాసం కోల్పోకుండా విద్యార్థుల యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దుతామని తెలియజేశారు.

# బొద్దుగొండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ని సందర్శించిన డిఎం అండ్ హెచ్ఓ



మహబూబాబాద్ జిల్లా, జులై 03 (తీన్మార్ న్యూస్): గురువారం గూడూరు మండలం బొద్దుగొండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ( సబ్ సెంటర్) ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ మాట్లాడుతూ వర్షాకాలంలో అధికంగా వ్యాపించే సీజనల్ వ్యాధుల నివారణపై తీసుకోవలసిన ముందు జాగ్రత్తల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ లను, మలేరియా, డెంగ్యూ సంభంధిత ఆర్‌డిటి కిట్ల నిల్వలను సరిచూసుకోవాలని, లేనట్లైతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టి కి తీసుకెళ్లి నిల్వలను సమకూర్చుకోవాలని, అన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, అతిసారం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రతి శుక్రవారం డ్రై డే ను ప్రజలు పాల్గొనే విధముగా అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తూ, దోమల నివారణ చర్యలు తీసుకోవాలి అని, గ్రామస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు ఇంటింటా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వర్షాలు ఎక్కువగా వున్నట్లైతే గర్భిణీ స్త్రీలు కాన్పు కు దగ్గరగా వున్నవారిని ఆసుపత్రిలో ముందుగానే చేర్చుకొని ప్రసవం పిదప వారిని పంపించాలని పేరుకొన్నారు. టిబి ముక్త్ భారత్ కార్యక్రమములో భాగముగా 2025 నాటికి భారతదేశం క్షయ వ్యాధినిర్మూలన దిశగా పురోగతిని వేగవంతం చేయడములో క్షేత్ర స్థాయి సిబ్బంది, ప్రజలలో అవగాహన కల్పించి వల్నరబుల్ జనాభాకు క్షయ నిర్ధారణ పరీక్షలు చేపించి పాజిటివ్ గా నిర్ధారణ జరిగితే పూర్తి చికిత్స అంధించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కె. ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి. రాజు, ఎం ఎల్ హెచ్ పి ప్రశాంత్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యాసన నైపుణ్యాలు, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి





**డైట్ మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం అందించాలి**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్ జిల్లా, జూలై 03 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, గురువారం మండల ప్రజా పరిషత్ అప్పర్ ప్రైమర్ స్కూల్, బ్రాహ్మణపల్లి, (లక్ష్మీపురం), మండల ప్రజా పరిషత్ స్కూల్ కొమ్ముగూడెం లలోని పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణంలో సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనం, తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్శనలో విద్యార్థుల హాజరు, అభ్యాసన సామర్థ్యాలు, తరగతి గదుల్లో బోధనా పరిస్థితులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై సమగ్రంగా సమీక్షించారు. విద్యార్థుల పఠనాభివృద్ధికి పాఠశాలలు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ అభినందించారు. ప్రత్యేకంగా కొమ్ముగూడెం పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా కలెక్టర్ ఒక మొక్కను నాటినారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దడం జరుగుతుందని, అనేక సౌకర్యాలు కల్పిస్తూ అత్యుత్తమ సాంకేతిక విద్య బోధనలు అందించడం కోసం విద్యాశాఖను బలోపేతం చేస్తుందని అన్నారు, "పిల్లల అభ్యాసన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం కలిసి పనిచేయాలి అని పాఠశాలలు ఉత్తమ పాఠశాలలుగా మారాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అని ప్రభుత్వ విద్యా సంస్థలలో తమ పిల్లలను చేర్పించాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు, అదనపు తరగతి గదునుల నిర్మాణం వేగంగా చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల ఆవరణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు

ప్రభుత్వ సూచించిన మోనో ప్రకారం రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, జిల్లా విద్యాశాఖ అధికారి డా. రవీందర్ రెడ్డి, మాట్లాడుతూ విద్యార్థులలో తగిన నైపుణ్యాలు, విలువలు, భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ అప్పారావు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇల్లు అర్హులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన వ్యక్తి మృతి

**తప్పుడు కేసు పెట్టాలని చూస్తున్నారని ఉరివేసుకున్న యువకుడు**

**పోలీసుల తీరుపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం**

**జాతీయ రహదారిపై బైటాయించి న్యాయం చేయాలని డిమాండ్**



గోవిందరావుపేట, జులై 03 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇల్లు అర్హులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన ఓ యువకుడి ప్రాణం తీసిన సంఘటన ములుగు జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం, చల్వాయి గ్రామానికి చెందిన చుక్క రమేష్ (వయసు 24) గురువారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం రెండు నెలలుగా చల్వాయి గ్రామస్థాయి వాట్సాప్ గ్రూప్ లో రమేష్, అర్హులైనలబ్ధిదారులకు ఇల్లు ఇవ్వకుండా కుంభకోణం జరుగుతోందని పలు సందేశాలు పెట్టుతూ వచ్చాడు అని, అర్హులకు అధికారుల తీరుతో న్యాయం జరగడం లేదని విసుగుగా మెసేజ్లు పెడుతూ ఉన్నాడు అని తెలిపారు. ఈ చర్చలకు గ్రూప్ లో హీట్ పెరిగి గ్రామంలోని కొందరు పెద్ద మనుషులు తనపై తప్పుడు కేసులు నమోదు చేయటం వల్ల బుధవారం రాత్రి పసర పోలీసులు రమేష్ మొబైల్ను స్వాధీనం చేసుకుని, రేపు స్టేషన్కు రమ్మని చెప్పినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. తప్పుడు కేసు పెట్టాలని చూస్తున్నారన్న అనుమానంతో రమేష్ తీవ్ర మనోవేదనకు లోనై, తన ఇంటి వద్ద ఉరివేసుకొని ప్రాణాలు విడిచినట్టు బంధువులు తెలిపారు. రమేష్ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, బంధువులు జాతీయరహదారి మృతదేహంతో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బైటాయిన్నారు. తప్పుడు కేసు పెట్టాలని చూస్తున్నారన్న అనుమానం లాంటి ప్రాథమిక అవసరంకోసం ఆందోళన వ్యక్తం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని, బాధ్యత వహించాల్సిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, రమేష్కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

# రమేష్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

**జిల్లా టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు కోగిల మహేష్**



గోవిందరావుపేట, జులై 03 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అన్యాయాన్ని ప్రశ్నిస్తూ నిజమైన అర్హులైన పేదలకు ఇవ్వాలని సోషల్ మీడియాలో ప్రశ్నించిన సోదరుడు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చుక్కా రమేష్ ని కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు సమాచారం అందించి వారి ద్వారా అతనిని బెదిరించి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న తర్వాత తదుపరి మా నాయకుడు వచ్చాక నీ సంగతి చెప్తామని బెదిరించడంతో మనస్థాపానికి, భయానికి గురి అయిన చుక్కా రమేష్ గురువారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న టిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కోకిల మహేష్ చల్వాయి గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా కోకిల మహేష్ మాట్లాడుతూ ఇది ముమ్మాటికి ప్రభుత్వం చేసిన హత్య అర్హులకు పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ నాయకులు భౌతిక దాడులు చేయడం ఆత్మహత్య చేసుకునే విధంగా మానసికంగా భయభ్రాంతులకు గురిచేయడం ములుగులో ములుగు జిల్లాలు పరిపాటిగా మారిందని అన్నారు. ఇప్పటికైనా ప్రశ్నిస్తున్న వారిపై ఇలా భౌతికదాడులు వారిని బెదిరించి మానసికంగా ఇబ్బంది పెట్టి చంపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై జిల్లా ఎస్పీ జిల్లా కలెక్టర్ పాడినమైన చర్యలు తీసుకోవాలని దీనికి పూర్తి బాధ్యత జిల్లా మంత్రి సీతక్క వాయిస్తూ పార్టీ నాయకులను పార్టీ నుండి తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ఎవరైతే ప్రాణాలను కోల్పోయిన దాడులకు గురి అవుతున్న వారికి అండగా టిఆర్ఎస్ అండగా ఉంటుందని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను దయచేసి యువకులు మరియు ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వాళ్లు చేసిన అన్యాలను ప్రశ్నించండి కానీ ఇలా ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఏదైనా ఉంటే బ్రతికి ఉండి సాధించుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని ఆ కుటుంబానికి తీరని లోటు దయచేసి జిల్లా కలెక్టర్ మా కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు విచ్చలవిడిగా ఇసుక దొంగ ద్వారా గ్రావెల్ దొంగ భూముల గంగా ద్వారా సంపాదిస్తున్న అక్రమ డబ్బును అడ్డం పెట్టుకొని జిల్లాలో ఇలా అమాయకుల ప్రాణాలను పని తీసుకుంటున్నారని వెనుకోండి నడిపిస్తూ ఈరోజు అజ్ఞతకు పాల్పడగానే మాకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని ఇదంతా ప్రజలు గమనిస్తున్నట్లు కోయిల మాయలు తెలిపారు పోలీస్ శాఖ వారు రమేష్ యొక్క కాల్ డాటా ను మరియు వాట్సాప్ చాటింగ్ అలాగే సాయంత్రం పూట వచ్చిన వారిని గుర్తించి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిందితులు ఎంతటి వారైనా ఏ స్థాయిలో ఉన్న శిక్షించాలని అలాగే వాళ్ళ వెనక ఉండి నడిపిస్తున్న నాయకులపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



చిట్యాల, జులై 03 (తీన్మార్ న్యూస్): శుక్రవారం హైదరాబాదులోని ఎల్.బీ స్టేడియం లో నిర్వహించ తలపెట్టిన గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని, ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే రానున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఈరోజు గురువారం చిట్యాల లోని ఎమ్మెల్యే మినీ క్యాంపు కార్యాలయం తో పాటు భూపాలపల్లి లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో వేరువేరుగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు డిసిసి అధ్యక్షులు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ మోత్కురి ధర్మారావు, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ ఇతర ముఖ్య నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేపు హైదరాబాదులోని ఎల్.బీ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని, భూపాలపల్లి నియోజకవర్గం నుండి వెయ్యి మందికి తగ్గకుండా రావాలని సూచించారు. ఈ సమ్మేళనానికి మల్లికార్జున ఖర్గే పాటు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశాల్లో పలువురు కాంగ్రెస్ నేతలు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# ఔషధ గుణాలు గల మేకపాల ఉత్పత్తి, విక్రయ కేంద్రాల ఏర్పాటు అవసరం

**కలెక్టర్ జితేష్ వి పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 03 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈరోజు కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖాధికారి, మండల స్థాయి పశు వైద్యాధికారులు, జిల్లా వెటర్నరీ వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గిరిజన గ్రామాలలో గిరిజనులు మరియు మహిళల వద్ద ఉన్న మేకల సంతతిని అభివృద్ధి చేసి అధిక పాల దిగుబడి సాధించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మేకపాల విశిష్టతను ప్రజలకు తెలియజేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మేకపాల నుండి పెరుగు, మజ్జిగ, జున్ను, పన్నీరు, చీజ్ వంటి ఉత్పత్తులను తయారు చేసి వినియోగించే పద్ధతులపై గిరిజనులు మరియు మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. అదేవిధంగా, మేకపాలను ప్రోత్సహించడం ద్వారా మేకలు అడవుల్లో లభించే ఆకులు, చెట్లు మేతగా తీసుకోవడం వలన అడవులను రక్షించవచ్చని, అడవులు మనలను రక్షిస్తాయని కలెక్టర్ తెలిపారు. మేకల మేత కోసం అవసరమైన మొక్కలను నాటడం ద్వారా అడవుల అభివృద్ధి జరగగలదని, దీని వల్ల గిరిజనులు, మహిళలు, సమాజం మొత్తానికి లాభం చేకూరుతుందని వివరించారు. జిల్లా ప్రజలకు ఆరోగ్యకరమైన మేకపాలను అందించడానికి ప్రత్యేకంగా మేకపాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వీటి మార్కెటింగ్ ద్వారా గిరిజనులు మరియు మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఇకపై గిరిజనులు మరియు మహిళలను బాతులు, కౌజు పిట్టల పెంపకంపై కూడా ప్రోత్సహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని, ఈ చర్యల ద్వారా ఆదివాసీ కుటుంబాలు మరియు మహిళలు ఆర్థికంగా లాభపడడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారం పొందగలరని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖాధికారి, మండల స్థాయి పశు వైద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 4వ తేదీన దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు

జనగామ జిల్లా, జులై 03 (తీన్మార్ న్యూస్): జనగామ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, అధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు జిల్లాలోని ఐడిఓసీ భవనము (కలెక్టర్ కార్యాలయం) లో ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, కురుమ కుల సంఘం నాయకులు ప్రతినిధులు ఇతర కుల సంఘాల నాయకులు ఈ కార్యక్రమముకు హాజరై విజయవంతము చేయాలని కోరారు.

# మేడారం మహా జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**వసతుల సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**మేడారంలో చేపట్టే పనులను శాశ్వతంగా నిలిచేలా ఉండాలి**

**పక్క ప్రణాళిక తో ముందుకు వెళ్ళాలి**

**కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్ నివేదిక సమర్పించాలి**

**రాష్ట్ర ఎండోమెంట్స్ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్**






తాడ్వాయి, జూలై 03 (తీన్మార్ న్యూస్): రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతర సందర్భంగా చేపడుతున్న పనులు శ్వాశతంగా నిలిచేలా పనులను పూర్తి చేయాలని, ప్రతి జాతరకు వందల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తూ పనులు చేపడుతున్నమని తెలంగాణ ఎండోమెంట్ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ అన్నారు. గురువారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారం ఐటీడీఏ గెస్ట్ హౌస్ సమావేశ మందిరంలో

తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్స్ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అడ్వైజర్ గోవిందహరి లతో కలిసి శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర, 2026 పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మేడారం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా సౌకర్యాల ఏర్పాటు కొరకు స్టూడియో వన్ ఆర్కిటెక్టర్ రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై క్షేత్ర స్థాయిలో పరిశీలన, పూజారులు, అధికారులతో చర్చించుటకు సమావేశ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మేడారం వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనుల మాస్టర్ ప్లాన్ నివేదికను కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పక్క ప్రణాళిక తో రూపొందించాలని అన్నారు. కోటిన్నర భక్తులు హాజరయ్యే ఈ నాలుగు రోజుల జాతరకు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చెయ్యాలని అన్నారు. ప్రతి జాతరకు కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నమని, ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అంతుముందు జంపన్న వాగు, చిలుకలగుట్ట, కన్నెపల్లి లోని సారలమ్మ దేవాలయం ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎండోమెంట్ అడ్వైజర్ గోవిందా హరి తో కలిసి మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకోగా సమ్మక్క సారలమ్మ పూజారులు డోలు వాయిద్యాలతో స్వాగతం పలికి గద్దెలపైకి తోడుకొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, ఏ పి ఓ వసంత రావు, ఈ ఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, పూజారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ భూములను జోలికొస్తే ఖబర్దార్

**రిజిస్ట్రార్ చాంబర్లో విద్యార్థి సంఘాల ధర్నా**

**విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్.. పోలీస్ స్టేషన్ కీ తరలింపు**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకోం**






హనుమకొండ కేయు, జూలై 03 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీ భూములను యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి గత నెల 17వ తారీఖున యూనివర్సిటీ పాలకమండలి 15 ఎకరాల భూములను కేటాయించి ఆమోదం తెలిపిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈరోజు కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ఛాంబర్ లో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీ భూములలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆమోదం తెలిపిన పాలకమండలి నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఇప్పటికే కబ్జా ఆయన యూనివర్సిటీ భూములను స్వాధీనం చేసుకొని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని యూనివర్సిటీ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గత సమావేశంలోనే సంఘ నాయకులు యూనివర్సిటీ భూముల్లో నిర్మించద్దని కోరారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను ప్రభుత్వ స్థలం లోనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. పాలకమండలి భూములు కేటాయించే ఎక్కడిదాని ప్రశ్నించారు. యూనివర్సిటీ అధికారులు తమ నిర్ణయాన్ని తీసుకోకపోతే ఈ నెల 7న జరిగే కాన్వకేషన్ అడ్డుకుంటామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే ఒక వర్గమును తయారుచేసి యూనివర్సిటీ భూములలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను పెట్టేలా తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి చేరవేస్తూ యూనివర్సిటీ భూములను కుట్రలో భాగంగానే ఈ ప్రయత్నన్ని ఖచ్చితంగా అడ్డుకుంటామని అన్నారు. రిజిస్ట్రార్ చాంబర్లను శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ కు తరలించడని విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు ఖండించాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్డిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, డిఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, కో కన్వీనర్ మున్నా గణేష్, బిఆర్ఎస్వి యూనివర్సిటీ అధ్యక్షులు బైరపాక ప్రశాంత్, నాయకులు వీరాస్వామి, పస్తం అనిల్, కొత్తూరి రోహిత్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు సాయికుమార్, పిడిఎస్యూ జిల్లా కార్యదర్శి మరి మహేష్, ఎఐడిఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షులు మధు, సురేష్, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు సాయి, యూనివర్సిటీ కన్వీనర్ అన్నమయ్య, ధర్మ, విష్ణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన విజయోస్తు 2.0

**పక్కాగా కార్యాచరణ**

**పాఠశాలల అన్ని అంశాలను ఆన్లైన్ లో నమోదు చేయాలి**

**విద్యాశాఖ మీద కలెక్టర్ ప్రత్యేక దృష్టి**

**విద్యార్థుల ఉన్నతికై నిరంతర సమీక్షలు,రివ్యూలు**

**పదవ తరగతి అయిపోయిన విద్యార్థి ఇంటర్ లో చేరాలి**

**కేరిర్ గైడన్స్ ఇవ్వాలి**

**ఉన్నతమైన విద్యా ప్రమాణాలు, పౌష్టికాహారం అందించడమే లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా, జూలై 03 (తీన్మార్ న్యూస్): 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బడిబాట నమోదు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణి, అకాడమీక్ క్యాలెండర్,పదవ తరగతి అయిపోయిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లో చేరడం, ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్ష లకై ముందస్తు కార్యాచరణ తదితర అంశాల మీద అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డి ఈ ఓ లతో కలిసి ఎమ్. ఈ. ఓ, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రివ్యూ తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి భవిష్యత్ ఉపాధ్యాయుల మీద ఆధార పడి ఉన్నదన్నారు. విద్యార్థులు ప్రతీ రోజూ పాఠశాల కి వచ్చేలా రెగ్యులర్ గా మనటరింగ్ చేసి ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. టీచర్స్ ల అటెండెన్స్ కి సంబందించి ప్రతీ రోజూ నివేదిక సమర్పించాలన్నారు. అత్యవసరం ఉంటేనే టీచర్ లు లీవ్ పెట్టాలని పాఠ్యంశాల బోధన కి ఇబ్బంది కలగకుండ లీవ్ మేనేజ్మెంట్ చేసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని స్పష్టం చేశారు. అలాగే ఏ విద్యార్థి సీజనల్ వ్యాధులు బారిన పడకుండా శానిటేషన్ పక్కాగా ఉండాలని ప్రతీ స్కూల్ పరిశుభ్రం గా ఉండాలన్నారు. కిచెన్ రూమ్ కూడా నీట్ గా ఉండాలని వంట కి ఉపయోగించే నీరు శుభ్రం గా ఉండాలన్నారు. కూరగాయలను కూడా ఒకటికి రెండు సార్లు కడిగి వంట కి వాడాలన్నారు. కొత్తగా అడ్మిషన్ గా తీసుకున్న విద్యార్థులు ముందు బెంచ్ లో కూర్చునేలా చేయాలనీ ఏబీసీ క్యాటగిరిని పాటించాలన్నారు. పదవ తరగతి విద్యార్థి ఇంటర్మీడియట్ లో చేరేలా మనటారింగ్ చేయాలన్నారు.

జులై 10 వ తేదీ లోపు ఏ విద్యార్థి ఏ కాలేజ్ లో జాయిన్ అయ్యారో.. దానికి సంబందించిన నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే పదవ తరగతి పరీక్ష లకై ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే కేరిర్ గైడన్స్ ఉండాలని బాలికలకి, బాలుర లకు క్రీడలలో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ప్రతీ పాఠశాల లలో కనీసం 3 సోక్ పిట్స్ నిర్మించాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాల లలో మొక్కలను నాటాలన్నారు. నషా ముక్త భారత్ భాగం గా హైస్కూల్ విద్యార్థుల మీద ఫోకస్ పెట్టాలన్నారు. వారి బ్యాగ్ లను ఎప్పటికప్పుడు చెక్ చేయాలన్నారు. మండల వారిగా మ్యాపింగ్ చేసుకుని అవసరం ఉన్న వాళ్ళని హాస్టల్లో జాయిన్ చేపించాలన్నారు. అంగన్వాడీ పాఠశాలలో బోధన తీరు మెరుగు పడాలన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగల కో ఆర్డినేటర్లు, అన్ని పాఠశాలల కేజీవిబీ, మాడల్ స్కూల్ హెడ్ మాస్టర్ లు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లా ఉద్యాన శాఖ పథకాలపై సమీక్ష సమావేశం



జయశంకర్ భూపాలపల్లి, జూలై 03 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మరియు ములుగు జిల్లాలలో ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాల పురోగతిపై సమీక్షించేందుకు జి. సంగీత లక్ష్మీ, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్, భూపాలపల్లి జిల్లా మీటింగ్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జయశంకర్ భూపాలపల్లి మరియు ములుగు జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ సిబ్బంది మరియు మైక్రో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో మైక్రో ఇరిగేషన్, సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకం, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం, ఆయిల్ పామ్ విస్తరణ, మరియు పందిరి కూరగాయల సాగు, బాంబు మిషన్ తదితర పథకాల అమలు పురోగతిపై అంశాలవారీగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పథకంలో ప్రతి వారము పురోగతిని రాష్ట్ర ప్రభుత్వం గమనిస్తోందని, అధికారులు అధిక జాగ్రత్త వహించి లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. రైతులకు వేగవంతంగా డ్రిప్పు పరికరాల అందజేత, సాగు మార్గదర్శకాలు, మద్దతు పరికరాలు అందించాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో మైక్రో ఇరిగేషన్ పథకాన్ని వేగంగా అమలు చేయాలని, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి పరికరాల పంపిణీని తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. రైతుల వద్దకు పథకాల లబ్దిని పారదర్శకంగా తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో భూపాలపల్లి జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ సునీల్ కుమార్, ములుగు జిల్లా ఉద్యాన శాఖ అధికారి డి సంజీవరావు, ఉద్యాన అధికారులు శ్రీకాంత్ లావణ్య మణి, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు రహీం సుదర్శన్ రాజు శ్యామ్, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సమీక్షా సమావేశం అనంతరం ఉద్యాన సంయుక్త సంచాలకులు జి సంగీతలక్ష్మి భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ మిశ్రా ఐఏఎస్ ని కలిసి ప్రభుత్వం ఉద్యాన శాఖ పథకాలపై అవలంబిస్తున్న తీరును జిల్లాలో పురోగతిపై కలెక్టర్ తో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ సిబ్బంది తక్కువ ఉన్న కారణంగా ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాలలో మిగతా శాఖలను కూడా అనుసంధానం చేస్తూ జిల్లాలో ఉద్యాన పంటల సాగు పెరిగేలా తగు సూచనలు వివిధ శాఖలకు చేస్తామని తెలియజేశారు.

## జూలై 4న ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి అధ్యక్షుల సభను విజయవంతం చేయాలి



హనుమకొండ, జూలై 03 (తీన్మార్ న్యూస్): గురువారం హనుమకొండ భవాని నగర్ లోని తన నివాసంలో ఆత్మకూరు, దామెర, గీసుగొండ, సంగెం మండలాలకు మరియు 15వ,16వ,17వ డివిజన్ లకు చెందిన కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు. జూలై 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరుగనున్న ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేయదానికి అవసరమైన చర్యలపై దిశా నిర్దేశం చేయనున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేసేందుకు కృషి చేయాలన్నారు.

# సోక్ పిట్ నిర్మాణాలలో లక్ష్యాలను సాధించాలి

**ఆదేశించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా, జూలై 03 (తీన్మార్ న్యూస్): గురువారం రాత్రి కలెక్టర్ కార్యాలయం లో సోక్ పిట్ నిర్మాణాల లక్ష్యాలపై గూగుల్ మీట్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 5వేల సోక్ పిట్ నిర్మాణాల లక్ష్యాలను పెట్టుకోవడం జరిగిందని, సంబంధిత అధికారులు అందరూ నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. తక్కువ ఖర్చుతో 1మీటర్ పొడవు, వెడల్పు తో 300 రూ.లు నుండి 500 రూ.లు ఖర్చుతో చేపట్టాలని, ప్రతి రోజు పూర్తి అయిన సోక్ పిట్ ఫోటో లను గూగుల్ షీట్ లో అప్ లోడ్ చేయాలన్నారు. జిల్లా అధికారులు, ఇంజనీరింగ్, బ్యాంక్ లు, రైస్ మిల్లులు, వసతి గృహాలు, మహిళా సంఘాలు, గ్రామ పంచాయతీ లు, శాఖల వారీగా లక్ష్యాలను నిర్ధేశిస్తూ సాధ్యమైనన్ని సోక్ పిట్ నిర్మాణాలు చేపట్టి ప్రగతి సాధించాలన్నారు.

# నిరుపేద మహిళకు హార్ధిక చేయుత

**5000 అందజేసిన ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి**



రేగొండ, జులై 03 (తీన్మార్ న్యూస్): నిరుపేద మహిళకు హార్ధిక చేయుట 5000 అందజేసిన జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆయిలి మారుతి ఆధ్వర్యంలో గత కొన్ని ఏళ్ళ నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపదలో పేదలకు ఆర్థిక సాయం అందజేస్తు ముందుంటున్న మారుతిని పలువురు అభినందిస్తున్నారు. రేగొండ మండలం కనపర్తి గ్రామానికి చెందిన సాధు కృష్ణవేణి - వినీత్ దంపతులు నిరుపేద కుటుంబం పట్ల స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం తన వంతు సహాయంగా 5000 రూపాయలు అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితురాలు కృష్ణవేణి గత కొంతకాలం నుండి తలలో రక్తం గడ్డ కట్టిన సమస్యతో బాధపడుతూ ఉండడంతో వారి కుటుంబం ఆమె కోసం అప్పుచేసి ఆమె తలకు ఆపరేషన్ చేయించారని, మళ్లీ నెల తర్వాత మందుల కోసం హాస్పటల్ కు వెళ్లడానికి వారి దగ్గర డబ్బులు లేకపోవడంతో అప్పుగా డబ్బుల కోసం ఎవరిని అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధపడుతూ ఉండగా, ఆ ఊరిలోని కొందరు జయశంకర్ ఫౌండేషన్ గురించి చెప్పడంతో వెంటనే స్పందించిన జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ తక్షణమే ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.

# రోగనిర్ధారణ పరీక్షల లక్ష్యాలను అధిగమించాలి



వరంగల్ జిల్లా, జూలై 03 (తీన్మార్ న్యూస్): భారత ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, అదనపు కార్యదర్శి - అరుంధతి పట్నాయక్ MD (NHM) ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా %ఐదీ% ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్ పై సమీక్షించారు. వరంగల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి.సంధ్యరాణి గార్లతో పాటు జిల్లా వైద్యశాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో 8 రకాల వ్యాధి కారకాల బారిన పడే వ్యాధిగ్రస్తుల సంఖ్య 2,04,979 మంది ఉన్నారని వారికి 3,794 మందికి జూన్ 3 నుండి రెండో విడత టిబి, మరియు 8 రకాల వ్యాధి గ్రాస్తులకి స్క్రీనింగ్ పరీక్షలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా హెల్త్ హబ్ గా పేరుగాంచిన జిల్లాలో టి బి, తదితర 8 రకాల వ్యాధులను నిర్మూలించుటకు జిల్లా వైద్యశాఖ కృషి చేస్తుందని, టీబీ రహిత జిల్లాగా మార్చుటకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పదేళ్లపాటు బిసిలు యాదికి లేరా

**ఎమ్మెల్సీ కవితకు మహేశ్ గౌడ్ చురకలు**



**హైదరాబాద్,జులై 3 :** ఎమ్మెల్సీ కవిత ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాసింది బిఆర్ఎస్ నేతగానా? జాగృతి నాయకురాలిగానా? అని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిసిల కోసం కవిత ఉద్యమం ఎక్కడ చేసిందని అన్నారు. పదేళ్ల పాటు బిసిలు గుర్తుకు రాలేదా అంటూ కవితకు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో బిసి బిల్లు చేసేటప్పుడు కవిత జైల్లో ఊచలు లెక్కపెడుతోందని విమర్శించారు. కవిత ఇప్పటిదాకా బిసిల కోసం ఒక్క మాట మాట్లాడిందా? అని అన్నారు. రాజకీయ శూన్యంలో ఉన్న కవిత ఉనికి కోసమే మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. పదేండ్లు బిసిలకు మాజీ సిఎం కెసిఆర్ ఏం చేశారని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. బిసిల రిజర్వేషన్లు తగ్గించింది కెసిఆర్ కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ లో కోవర్టులున్నారన్న ఎమ్మెల్యే అనిరుధ్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలపై తీవ్రంగా పరిగణిస్తున్నామని, పార్టీ నేతలు మాట్లాడేటప్పుడు చూసుకుని మాట్లాడాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడితే ఎలా? అని మండిపడ్డారు. క్రమశిక్షణ విషయంలో రాజీపడేది లేదని, బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు.

## నైజీరియిన్‌ను పట్టుకుని మత్తు పదార్ధాల స్వాధీనం

**హైదరాబాద్,జులై 3 :** మత్తు పదార్ధాల రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా ఆసిఫ్‌నగర్ లో భారీగా మత్తు పదార్ధాలు బయటపడ్డాయి. సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు నైజీరియన్‌ను వెంబడించి పట్టుకుని అరెస్ట్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి పోలీసులు వెంబండించారు. ఆసిఫ్ నగర్ లోనీ ఓ అపార్ట్‌మెంట్ లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎస్ఓటీ పోలీసులు ఆసిఫ్ నగర్ లోని ఓ ప్లాట్ లో సోదాలు నిర్వహించిన పోలీసులు మత్తు పదార్ధాలను స్వాధీనం చేసుకున్నారు. దొరికిన మత్తు పదార్ధాలను టెస్టింగ్ కు తరలించారు. మారేడుపల్లి, ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో ఇద్దరిపై పలు కేసులు నమోదయ్యాయి. కేటుగాళ్లు కోర్టుకు హాజరవకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

## రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ మృతి



**సిద్దిపేట,జులై 3 :** సిద్దిపేట జిల్లాలోని చేర్యాల గేటు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిల్మ్‌నగర్ ఎస్ఐ రాజేశ్వర్ మృతి చెందాడు. అర్ధరాత్రి లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో ఫిల్మ్‌నగర్ ఎస్సై రాజేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆయన్ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బందోబస్తు ముగించుకొని వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ స్వస్థలం సంగారెడ్డిలోని చాణక్యపురి కాలనీ. వారం రోజుల క్రితమే హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. రాజేశ్వర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. 1990లో ఆయన పోలీసు శాఖలో ఉద్యోగంలో చేరారు. ఈ ఘటనతో స్థానిక పోలీసులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## ఆలయాల్లో విగ్రహాలు, ఆభరణాల చోరీ

***వరుస దొంగతనాలపై పోలీసుల నజర్***

***వలపన్ని ఇద్దరిని పట్టుకున్న పోలీసులు***

**హైదరాబాద్, జులై 3 :** ఆలయాల్లో విగ్రహాలను, ఆభరణాలను చోరీ చేసే ముఠాను పట్టుకున్నారు. అక్కడ ఉన్న పంచలోహ విగ్రహాలు.. బంగారు ఆభరణాలువీరు చోరీ చేస్తారు. పోలీసులకు దొరక కుండా తప్పించుకుని వెళ్లిపోతారు. ఇలా చోరీ చేసిన విగ్రహాలను ముంబై, చెన్నై స్మగ్లర్లకు అమ్మేస్తున్నారు. వరుసగా చోరీలు జరుగుతుండడంతో సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేయడంతో నిందితులు పట్టుబడ్డారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో వరుసగా జరుగుతున్న చోరీల కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. దాదాపు ఫిబ్రవరి నుంచి నిన్న మొన్నటి వరకు ఆలయాల్లో జరుగుతున్న చోరీలు పోలీసులను కలవరపాటుకు గురిచేశాయి. ఎంతగా దర్యాప్తు చేస్తున్నా.. దొంగలు పట్టుబడలేదు. కానీ సాంకేతిక ఆధారాలు, ఇతర అంశాలను ఆధారం చేసుకుని చివరకు కేసును ఛేదించారు.. ఈ కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5,36,300 విలువైన పంచలోహ విగ్రహాలు, ఇతర బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వరుసగా దేవాలయాల్లో చోరీలు పాల్పడుతున్న నిందితులను ఆంధ్రకు చెందిన పాత నేరస్తులని అధికారులు తేల్చారు. ఈ దొంగలు ఇద్దరిని కే. శివానంద, షేక్ హమ్ షరీఫ్‌గా పోలీసులు గుర్తించారు. నిందితులు కర్నూల్, ప్రకాశం జిల్లాలకు చెందిన వలస కార్మికులని చెబుతున్నారు. ఎలాగైనా డబ్బు సంపాదించాలని ఆలయాలపై చోరీలకు పాల్పడ్డట్లు తెలిపారు. శివానందపై గతంలో కాజీపేట్, మీర్‌పేట్, నాగోల్ పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు నమోదై ఉన్నాయి. ఫిబ్రవరి 27 నుండి జూన్ 30 మధ్య కాలంలో యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని ఆరు ఆలయాల్లో చోరీలు చేశారని విచారణలో తేలింది. దొంగతనం చేసిన తర్వాత విగ్రహాలను ఉప్పల్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి శివకుమార్‌కు అమ్మేశారు.. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఆలయాల నుంచి దొంగిలించిన పంచలోహ విగ్రహాలను చెన్నై, ముంబైలోని స్మగ్లర్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. అటు నుంచి విదేశాలకు కూడా ఈ పంచలోహ విగ్రహాలు వెళ్తున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు.

# విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే సమర్ధ విపత్తు నిర్వహణ

**ఎన్డీఎంఏ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్**

**కలెక్టర్ తో కలసి జిల్లా విపత్తు చర్యలపై**

**సమీక్షించిన ఎన్డీఎంఏ అధికారుల బృందం**




వరంగల్ జిల్లా, జూలై 03 (తీన్మార్ న్యూస్): విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే సమర్థ విపత్తు నిర్వహణ సాధ్యమని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్డీఎంఏ) సీనియర్ అధికారుల బృందం పేర్కొంది. ఎన్డీఎంఏ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్ , అండర్ సెక్రటరీ అభిషేక్ బిశ్వాస్, సీనియర్ కన్సల్టెంట్లు వసీం ఇక్బాల్, డాక్టర్ గౌతమ్ కృష్ణ, సంద్రా, అనుపమా, గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక నవీకరణ, డిజాస్టర్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ కార్యకలాపాలు, విపత్తు ముప్పు తగ్గింపుతో పాటు భవిష్యత్తు విపత్తులను ఎదుర్కొనే వ్యవస్థ పటిష్టత తదితర అంశాలపై సమీక్షించి, సమన్వయ శాఖల అధికారులతో చర్చించారు. మాక్ డ్రిల్స్ నిర్వహణ సామర్థ్య నిర్మాణంపై అధికారులకు శిక్షణ, సమన్వయం వంటి అంశాల్లో జిల్లాలో చర్యలపై కూడా చర్చించారు. వరదల సమయంలో బాధితులకు చేయూతనివ్వడం, పునర్నిర్మాణ చర్యల్లో అధికార యంత్రాంగం చూపిన చొరవను కూడా బృందం సభ్యులు ప్రశంసించారు.ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనే సరైన సన్నద్ధత విషయంలో ప్రతి శాఖా తమదైన ప్రత్యేక విపత్తు నిర్వహణ ప్రణాళికలను రూపొందించడం కీలకమని చెప్పారు. చట్ట ప్రకారం కొత్తగా పట్టణ విపత్తు నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై రియల్టైమ్ హెచ్చరికల వ్యవస్థలో సచేత్ కీలక మైలురాయి అని, ఈ యాప్ పై అధికారులతో పాటు ప్రజలకు ముఖ్యంగా గ్రామస్తులలో అవగాహన కల్పించాలని సూచించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికలో ఏఐ, డ్రోన్ టెక్నాలజీ వంటి సాంకేతికతలను పొందుపరచడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఆపద మిత్ర, ఇతర వలంటీర్ సేవలకు ముఖ్యంగా యువతను ప్రోత్సహించాలని ఎన్డీఎంఏ అధికారుల బృంద సభ్యులు పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో విపత్తు నిర్వహణ ప్రణాళికలతో పాటు జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి మరియు జాతీయ విపత్తు తగ్గించే నిధిని కూడా అందిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు, జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించడం జరిగిందని, విపత్తుల సమయంలో చేపట్టే .

చర్యలు, సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలపై వివరించారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. గత సంవత్సరం వరదల వల్ల ఆకేరు వాగు నీటి వరద వల్ల 40 మంది ప్రయాణికులతో ఉన్న బస్సు నీటిలో దిగ్బంధం కాగా స్థానికుల సహకారంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా బయటికి రావడం జరిగిందన్నారు. గోదావరి కృష్ణ నదుల మధ్యలో వరంగల్ జిల్లా ఎత్తైన ప్రదేశంలో ఉన్నందున వరద ముప్పులేదని, అధిక వర్షాలు కురవడం వల్ల వరద సంభవించే అవకాశం ఉందని, అందుకు నగరంలోని ప్రధాన నాలాలను డీసిల్టేషన్ చేయడం జరిగిందన్నారు. గతంలో రాజులు నిర్మించిన గొలుసు చెట్టు చెరువులలో వర్షపు నీరు చేరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నగరం ముంపు గురి కాకుండా స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని తొలగించడం జరుగుతున్నదని అన్నారు. వర్షపు నీరు చేరుకొనుటకు గాను చెరువులలో పూడికలు తీయడం జరిగిందన్నారు. ఇటీవల భూకంపం సంభవించినప్పుడు జిల్లాలో రిచేట్ స్కేల్ పై 3.5 నమోదైందని, ప్రభుత్వం ద్వారా జిల్లాలో నిర్మిస్తున్న 10 వేల ఇందిరమ్మ గృహాలకు భూకంపం వల్ల నష్టం వాటిల్లకుండా సాంకేతికత అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి 24 గంటలు సహాయం చేయడం జరుగుతుందన్నారు. జిల్లా యంత్రాంగం ద్వారా ఆపద మిత్ర కింద 179 వాలంటీర్లను శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈసారి జిల్లాలో ముందస్తుగా జూన్ నుంచి వర్షాలు కురుస్తున్నందున అధికంగా వర్షాలు పడే అవకాశం ఉందని, విపత్తులు రాకముందే ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాస్థాయిలో అన్ని మండలాలు, గ్రామస్థాయిలో కమిటీలను తహసీల్దార్ అధ్యక్షతన ఏర్పాటు చేశామని, అదనపు కలెక్టర్‌ను విపత్తుల జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. వరద ముంపు ప్రాంతాల్లోని గ్రా మాలపై ప్రత్యేక దృష్టి సారించామని. శిథిలావస్థలో ఉన్న గృహాలను, పాఠశాలలను ముందస్తుగానే గుర్తించి అవసరమైతే వారిని ఇతర ప్రాంతాలకు తరలిస్తామని కలెక్టర్ అన్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు గ్రామాల్లో టామ్ టామ్ ల ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. పీహెచ్సీలలో తగినంత ఔషధాలు అందుబాటులో ఉంచినట్లు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్ల భవనాల శాఖ ద్వారా బ్రిడ్జిలు, కల్వర్ట్ లు ఇరువైపులా బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ద్వారా నగరంలో విపత్తును తక్షణమే ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 27 మంది, సిబ్బంది వాహనాలు బోట్లు రోప్స్ తదితర అన్ని ఎక్విప్మెంట్తో సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రేటర్ వరంగల్లో 170 చెరువులు ఉన్నాయని, 5 ప్రధాన నాలాలను డిసిల్టేషన్ చేయడం జరిగిందని, ప్రభుత్వ నిధులచే నాలాలను అభివృద్ధి, బలోపేతం చేయడం వల్ల నగరంలో ముంపు తగ్గిందన్నారు. తక్షణ సహాయార్థం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో రెస్పాన్స్ టీమ్లను చేయడం జరిగిందన్నారు. నగరంలో శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించి, నోటీసులు అందించి, గృహాలను తొలగించడం జరుగుతుందన్నారు. 2023లో వరదలు సంభవించినప్పుడు 2200 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఉచితంగా భోజనం, దుప్పట్లు ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. అగ్నిమాపక, పంచాయతీ, వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక శాఖ, పోలీస్, వ్యవసాయ శాఖల ద్వారా వరదలు సంభవించినప్పుడు చేపట్టే చర్యలపై ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులపై జిల్లా కలెక్టర్ సమీక్ష





**ఆసుపత్రులు సూపరింటెండెంట్లు, నర్సింగ్ సూపర్డెంట్లు, ఫార్మాసిస్టులతో ప్రత్యేక సమావేశం**

**విష జ్వరాల నేపథ్యంలో వైద్య సిబ్బందికి పలు సూచనలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 03 (తీన్మార్ న్యూస్): జిల్లాలో భారీ వర్షాలు నేపథ్యంలో రాబోయే రోజుల్లో విష జ్వరాలు ప్రభలే అవకాశం ఉన్నందున ఆసుపత్రి సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఈరోజు కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్ లకు ఆదేశాలు ఇచ్చారు. అన్ని రకాల మందులు, రీఏజెంట్లు, టెస్టింగ్ కిట్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. వివిధ హోదాల్లో ఉన్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించి 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు .ఇప్పటికే అన్ని ఆసుపత్రులలో కావాల్సిన మందులు రీఏజెంట్లు, మౌలిక వసతులు మరియు ఆధునిక యంత్రాలు ఏర్పాటు చేసిన క్రమంలో రాబోయే రోజుల్లో రోగు లను ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. అదేవిధంగా ఆసుపత్రులలో ఎటువంటి చిన్న చిన్న సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి తగిన పరిష్కార ఏర్పాట్లు తాను చేస్తానని , అవసరమైన నిధులు మంజూరు కి ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. ఆసుపత్రిలో ఇన్సులిన్, మలేరియా మందులు అందుబాటులో లేవని వాటి గురించి వైద్య సిబ్బంది జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రాష్ట్ర అధికారులతో మాట్లాడి వాటిని అందుబాటులోకి తీసుకొనిరావడానికి ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు,ఫార్మసిస్టులు ,నర్సింగ్ సూపరింటెండెంట్ లు మరియు శానిటేషన్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**




హనుమకొండ జిల్లా, జూలై 03 (తీన్మార్ న్యూస్): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వివిధ శాఖల అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధుల బారీన పడకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలను అధికారులు సందర్శించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు చికున్ గున్యా, డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధుల బారీన పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాలలో ఓపెన్ ప్లాట్లలో వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని, సంబంధిత ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలలో ఉపయోగకరంగా లేని వస్తువులు ఉన్నట్లయితే తీసేయాలన్నారు. పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని ఎంఈఓ లు, మండల ప్రత్యేక అధికారులకు సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు సీజనల్ వ్యాధులకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటుగా వాట్సప్ గ్రూపులలో పోస్ట్ చేయాలన్నారు. నీరు నిల్వ ఉండి లార్వా వృద్ధి చెందకుండా నిరోధించాలన్నారు. గ్రామ పంచాయతీలలో ఆయిల్ బాల్స్ అందుబాటులో ఉంచాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు కనీసం ఒక వార్డును తనిఖీ చేసి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యాసంస్థల్లో మంచినీటి వసతి, మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించాలన్నారు. వంట చేసే ప్రదేశంతో పాటు వంట వడ్డించే వారు వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత తో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను కూడా పాటించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ప్రతి గురువారం పరిసరాలను పరిశీలించాలని, ఏవైనా నీటి నిల్వలు ఉన్నట్లయితే తీసివేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా డిఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. వందరోజుల ప్రణాళికను రూపొందించి 24/7 పనిచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యల గురించి డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. సీజనల్ వ్యాధుల అంశం అనంతరం జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, నిర్మాణ సామగ్రి రేట్లు, వన మహోత్సవం, రేషన్ కార్డులు, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ట్రైనింగ్ గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

# సూక్ష్మ, చిన్న వ్యాపారులకు రుణాలు మరింత సులువు

## ముందస్తు చెల్లింపు జరిమానాలకు ఆర్‌బిఐ బ్రేక్




**ముంబై :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూక్ష్మ, చిన్న వ్యాపారులకు రుణాలు అందుబాటులో ఉండేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో జనవరి 1, 2026 నుంచి కొత్తగా ఇచ్చే లేదా పునరుద్ధరించే ఫ్లోటింగ్ రేట్ రుణాలపై బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు ముందస్తు చెల్లింపు జరిమానాలు విధించకూడదని ఆర్‌బీఐ తెలిపింది. ఈ నిర్ణయం ఎంఎస్‌ఇలకు ఆర్థిక సౌలభ్యాన్ని, స్వేచ్ఛను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నిర్ణయాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మైక్రో అండ్ స్మాల్ / మీడియం ఎంటర్‌ప్రైజెస్ స్వాగతించింది. ఈ విధానం గతంలో రిటైల్ రుణాలపై ముందస్తు చెల్లింపు జరిమానాలను నిషేధించిన ఆర్‌బీఐ ఆదేశానికి అనుగుణంగా ఉంది. రుణ గ్రహీతల హక్కులను కాపాడడం, రుణ మార్కెట్‌లో ఆర్థిక చేరికను ప్రోత్సహించడం పట్ల ఆర్‌బీఐ తన నిబద్ధతను మరోసారి గుర్తు చేసింది. ఈ నిర్ణయం ఓ÷ూఇలకు మరింత సౌలభ్యం, ఆర్థిక స్వేచ్ఛను అందిస్తుందని, దీనివల్ల వ్యాపారులు తమ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా మెరుగైన రుణ ఆప్షన్లను ఎంచుకుంటారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆర్‌బీఐ తన నోటిఫికేషన్‌లో సూక్ష్మ, చిన్న వ్యాపారాలకు సౌకర్యవంతమైన రుణ సౌలభ్యం చాలా ముఖ్యమని పేర్కొంది. బ్యాంకులు, ఔఃఈఅలు అనుసరిస్తున్న పద్ధతులను తమ పర్యవేక్షణ సమీక్షల్లో గుర్తించినట్లు తెలిపింది. ప్రధానంగా ముందస్తు చెల్లింపు జరిమానాలు రుణగ్రహీతలకు అసౌకర్యాన్ని కలిగించడమే కాక, ఒప్పంద వివాదాలకు కూడా దారితీస్తున్నాయని వెల్లడించింది. కొన్ని బ్యాంకులు, ఔఃఈఅలు రుణ ఒప్పందాల్లో పరిమితి కలిగించే నిబంధనలు చేర్చి, రుణ గ్రహీతలకు తక్కువ వడ్డీ రేట్లు లేదా మెరుగైన సేవల కోసం ఇతర రుణదాతల వైపు మళ్లకుండా అడ్డుకుంటున్నాయని ఆర్‌బీఐ బుధవారం రాత్రి జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. ఇలాంటి పద్ధతులు రుణ గ్రహీతల ఎంపిక స్వేచ్ఛను, మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీని దెబ్బతీస్తాయని హెచ్చరించింది. ఈ ఆంక్షల నుంచి కొన్ని రకాల రుణదాతలకు మినహాయింపు ఇచ్చారు. స్మాల్ ÷నాన్స్ బ్యాంకులు, రీజినల్ రూరల్ బ్యాంకులు, టైర్3 ప్రైమరీ (అర్బన్) కో ఆపరేటివ్ బ్యాంకులు, రాష్ట్ర, కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంకులు, మిడిల్ లేయర్ ఔఃఈఅలు ఉన్నాయి. దీంతోపాటు ఇప్పటికే రూ.50 లక్షల వరకు రుణాలపై ముందస్తు చెల్లింపు జరిమానాలు విధించకుండా నిషేధించబడ్డాయి. క్యాష్ క్రెడిట్ లేదా ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాల విషయంలో రుణ గ్రహీత ఒప్పందంలో నిర్దేశిరచిన వ్యవధిలో సౌకర్యాన్ని పునరుద్ధరించ కూడదని బ్యాంకుకు ముందస్తు సమాచారం ఇస్తే, సౌకర్యం గడువు తేదీన రద్దు అయితే, ముందస్తు చెల్లింపు జరిమానాలు వర్తించవని నోటిఫికేషన్ స్పష్టం చేసింది.

# అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం

## దుండగుల కాల్పుల్లో నలగురు హతం

**న్యూయార్క్ :** అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం రేగింది. బుధవారం చికాగోలోని రివర్ నార్త్ ప్రాంతంలోగల ఆర్టిస్ లాంజ్ అనే నైట్ క్లబ్ వద్ద కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా సుమారు 14 మంది గాయపడ్డారు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో వాహనంలో క్లబ్ ముందు నుంచి వెళ్లిన కొందరు అక్కడున్న జనాలపై కాల్పులు జరిపి పారిపోయారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందినట్టు చికాగో పోలీసులు ధ్రువీకరించారు. సుమారు 25 ఏళ్ల వయసున్న ఇద్దరు యువకులు, మరో ఇద్దరు యువతులు మృతిచెందినట్టు తెలిపారు. గాయపడ్డ వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నామని అన్నారు. అనుమానితుల సమాచారం తెలిసిన వారు వెంటనే తమను సంప్రదించాలని కూడా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక కాల్పులకు కారణమేంటో కూడా ఇంకా తెలియరాలేదు. అసలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు పోలీసులు ఘటనాస్థలం సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనాల ఆధారంగా ఘటన మూలాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక నైట్‌లైఫ్‌కు ప్రసిద్ధి గాంచిన రివర్ నార్త్ ప్రాంతంలో తాజా కాల్పుల ఘటన కలకలానికి దారి తీసింది. నగరంలో పెరుగుతున్న గన్ కల్చర్‌పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వారసుడి ఎంపిక అంతా దలైలామా ఇష్టమే

## అందులో ఎవరి జోక్యం కూడా సహించం

## చైనా ప్రకటనకు కేంద్రమంత్రి జవాబు



**న్యూఢిల్లీ :** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా చేసిన డిమాండ్‌ను భారత్ తోసిపుచ్చింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టంచేసింది. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఈమేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం, అందులో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనో లేదా ఆ సంస్థ మాత్రమే చేస్తుంది. దలైలామా స్థానం టిబెటన్లకు మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనది' అని రిజిజు పేర్కొన్నారు. దలైలామా 90వ పుట్టిన రోజు కార్యక్రమాలు బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల సుగ్లాగ్‌ఖాంగ్ ఆలయంలో ప్రారంభమయ్యాయి. దీనికి భారత్ తరఫున కిరణ్ రిజిజు, జనతాదళ్ (యునైటెడ్) నాయకుడు లల్లన్ సింగ్‌లు హాజరుకానున్నారు. తన వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని బుధవారం దలైలామా సోషల్ మీడియాలో పోస్టు ద్వారా తెలిపారు. భవిష్యత్తు గురువును గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాకు తేల్చి చెప్పారు. ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే చైనా దీనిపై స్పందించింది. తర్వాత దలైలామా ఎంపికకు తమ ఆమోదముద్ర ఉండాల్సిందేనని డిమాండ్ చేసింది. వారసుడి గుర్తింపు కార్యక్రమాన్ని చైనా విధానాలను అనుసరించి నిర్వహించాలని పేర్కొంది. 1950లో టిబెట్‌ను చైనా ఆక్రమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి భారత్‌లోని ధర్మశాలలో దలైలామా ఆశ్రయం పొందుతున్నారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే దలైలామాను వారసుడిగా ఎంపిక చేయాలని బీజింగ్ ఎప్పటినుంచో ప్రయత్నిస్తుంది. చైనా ఎత్తుగడలను గమనించిన దలైలామా వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ తమదేనని తేల్చిచెప్పారు.

# ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత పురస్కారం

**రాబోయే ఐదేళ్లలో భారత్-ఘనాల మధ్య రెట్టింపు వాణిజ్యం**

**ఘనంగా స్వాగతించిన ఘనా అధ్యక్షుడు...పార్లమెంటులో ప్రసంగం**

**భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు ఉన్నట్లు ప్రకటన**

**ఆశ్చర్య పోయిన పార్లమెంట్ సభ్యులు**



**న్యూఢిల్లీ :** భారత ప్రధానికి ఘనమైన స్వాగతం, సత్కారం లభించాయి. ఘనా అత్యున్నత పురస్కారం కూడా ప్రదానం చేసింది. రాబోయే ఐదేళ్లలో భారత్-ఘనా దేశాలు వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఘనాకు భారతదేశం కేవలం భాగస్వామి మాత్రమే కాదని.. ఇరుదేశాలు కలిసి జోడీగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారత కంపెనీలు ఘనాలో దాదాపు 900 ప్రాజెక్టులలో రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాయని మోదీ చెప్పుకొచ్చారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా పశ్చిమ ఆఫ్రికాలోని ఘనా దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఘనాలో ప్రధాని మోదీకి ఆ దేశ ప్రతినిధులు, ప్రజల నుంచి సాదర స్వాగతం లభిస్తోంది. ప్రధాని మోదీ, ఘనా అధ్యక్షుడు జాన్ డ్రామానీ మహామాతో పలు భాగస్వామ్య అంశాలపై చర్చించారు. ఇండియా.. ఘనాతో యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని.. ఇరు దేశాలు స్పష్టం చేశాయని, ఉగ్ర ముప్పును ఎదు-ర్కోవడంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. రక్షణ, భద్రతా రంగంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయని మోదీ చెప్పారు. సాయుధ దళాల శిక్షణ, సముద్ర భద్రత, రక్షణ సామాగ్రి సరఫరా, సైబర్ భద్రత తదితర రంగాల్లో భారత్-ఘనా దేశాల మధ్య పరస్పర సహకారం పెరుగనున్నదని ప్రధాని మోదీ తెలిపారు. అటు, సంస్కృతి, సాంప్రదాయ వైద్యం తోపాటు పలు రంగాల్లో సహకారాన్ని అందించే నాలుగు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకం చేశాయి. అనంతరం ఘనా పార్లమెంటును సందర్శించి సభ్యులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ గౌరవనీయమైన సభలో ప్రసంగించడం తనకు చాలా గౌరవంగా ఉందన్న మోదీ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రతినిధిగా, 1.4 బిలియన్ల భారతీయుల సద్భావన, శుభాకాంక్షలను తీసుకువచ్చానని అన్నారు. బుధవారం సాయంత్రం తన ప్రియ స్నేహితుడు, అధ్యక్షుడు జాన్ మహామా నుంచి ఘనా జాతీయ అవార్డును స్వీకరించడం హృదయపూర్వక అనుభవమని మోదీ సభకు చెప్పారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లని చెప్పిన మోదీ.. మనకు, ప్రజాస్వామ్యం కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదన్నారు. ఇది మన ప్రాథమిక విలువలలో ఒక భాగమని చెప్పుకొచ్చారు. భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు, వివిధ రాష్ట్రాలను పరిపాలించే 20 వేర్వేరు పార్టీలు, 22 అధికారిక భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయని మోదీ చెప్పారు. భారతదేశానికి వచ్చిన ప్రజలను ఎల్లప్పుడూ హృదయపూర్వకంగా స్వాగతించడానికి ఇదే కారణమని ప్రధాని అన్నారు. 'ఇవాళ మన దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు, ఘనా బిడ్డ డాక్టర్ క్వామే న్క్రుమాకు నివాళులర్పించే గౌరవం నాకు లభించిందని' అన్నారు. ఘనా పర్యటలో ప్రధాని మోదీ ఆ దేశ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశిష్ట రాజనీతి, ప్రభావవంతమైన ప్రపంచ నాయకత్వానికి గుర్తింపుగా ఆ దేశ అధ్యక్షుడు జాన్ డ్రామణి మహామా చేతుల మీదుగా ఘనా జాతీయ గౌరవం 'ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' పురస్కారాన్ని అందుకున్నారు. 1.4 బిలియన్ల భారతీయుల తరపున ఈ అవార్డును

స్వీకరిస్తున్నానని చెప్పిన మోదీ.. ఈ గౌరవాన్ని భారతదేశ యువత ఆకాంక్షలు, సాంస్కృతిక, సంప్రదాయాలు, వైవిధ్యం, ఇంకా ఘనా - భారత్ మధ్య చారిత్రక సంబంధాలకు అంకితం చేశారు. ఈ గౌరవాన్ని అందించినందుకు ఘనా ప్రజలకు, ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశంలో పర్యటించడం తనకు లభించిన గౌరవమని హర్షం వ్యక్తంచేశారు. ఘనా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతోందని కొనియాడారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఏర్పడిన ప్రపంచక్రమం వేగంగా మారుతోంది. సాంకేతికతలో విప్లవం, గ్లోబల్‌సౌత్‌లో ఎదుగుదల ఆ మార్పునకు దోహదం చేస్తున్నాయి. గ్లోబల్‌సౌత్ గళం వినిపించకుండా ఆ పురోగతి సాధ్యంకాదు అన్నారు. 2047నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని మా ప్రజలు సంకల్పంతో ఉన్నారు. బలమైన భారత్.. సుస్థిరమైన ప్రపంచానికి దోహదం చేస్తుంది. ఆఫ్రికా అభివృద్ధి దిశగా చేసే ప్రయాణంలో మా సహాయాన్ని అందిస్తాం. మన దేశాల పురోగతికి పరస్పరం సహకరించు కుందామని మోదీ పిలుపునిచ్చారు. జీ20కి భారత్ సారథ్యం వహిస్తోన్న తరుణంలోనే ఆ గ్రూప్‌లో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమని వ్యాఖ్యానించారు. ఈ పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పరిశోధన, అభివృద్ధి, ఔషధ తదితర రంగాలకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఒకరు ఘనాను సందర్శించడం ఇదే ప్రథమం.



# ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర

## కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**శ్రీనగర్,జూలై 3 :** కశ్మీర్ హిమాలయ పర్వతాల్లో మంచులింగం రూపంలో కొలువైన శివుడ్ని భక్తులు దర్శించుకునేందుకు కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. యాత్ర మార్గాల్లో గగనతలంపై నుంచి కూడా పర్యవేక్షణ సాగుతోంది. 38 రోజుల పాటు సాగే ఈ యాత్ర ఆగస్టు 9 నాటికి పూర్తవుతుంది. 3880 మీటర్ల ఎత్తులో ఉండే గుహలో ఉన్న ఈ క్షేత్రానికి గురువారం మొదటి బ్యాచ్ భక్తులు బల్తాల్, నున్‌వాన్ శిబిరాల నుంచి బయలుదేరారు. అనంతనాగ్ లోని పహల్గాం లో నున్‌వాల్ శిబిరం నుంచి 48 కిమీ రూటు నుంచి, సెంట్రల్ కశ్మీర్ లోని గండేర్‌బాల్ సోనామార్గ్ ఏరియా14 కిమీ బల్తాల్ రూటు నుంచి గురువారం తెల్లవారు జామున బయలుదేరారు. యాత్రికులు 'భంభం బోలే.. హరహరమహాదేవ్' నినాదాలతో ముందుకు సాగారు. ముందుగా భరించలేని వాతావరణంలో కష్టతరమైన మార్గం ఉన్నా వారి ముఖాల్లో ఆనందం తొంగి చూసింది. యాత్రికులు తమకు కట్టుదిట్టమైన భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. యాత్రికులతోపాటు కేంద్ర మంత్రి శోభ కరండ్లజే కూడా బల్తాల్ రూటులో బయలుదేరారు. బుధవారం జమ్ము లోని భగవతి నగర్ శిబిరం నుంచి మొదటి బ్యాచ్ 5892 మంది యాత్రికులు బయలుదేరారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. యాత్రికులు మధ్యాహ్నం కశ్మీర్ లోయకు చేరుకోగానే అధికారవర్గాలు, స్థానికులనుంచి వారికి ఘనమైన స్వాగతం లభించింది. గత ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడిలో 22 మంది తుపాకీ కాల్పులకు బలైపోయిన దుర్ఘటన దృష్టా భక్తులకు ఎలాంటి భయాందోళనలు లేకుండా ఉండేందుకు గట్టిభద్రతా ఏర్పాట్లు జరిగాయి. పోలీస్, పారామిలిటరీ విభాగాల నుంచి వేలాది మంది భద్రత సిబ్బందిని నియమించారు.

# బాలి సమీపంలో సముద్రంలో ఫెర్రీ మునక

## 43 మంది గల్లంతయినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై 3 :** ఇండోనేసియాలోని బాలి సమీపంలో ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మతి చెందగా.. 43 మంది గల్లంతయ్యారు. 20 మందిని సహాయక సిబ్బంది రక్షించారు. ప్రమాద సమయంలో అందులో 65 మంది ఉన్నట్లు గుర్తించారు. 22 వాహనాలు, 14 ట్రక్కులను అది మోసుకెళ్తున్నట్లు తెలిసింది. తూర్పు జావాలోని కెటాపాంగ్ పోర్టు నుంచి బయలుదేరిన అరగంటకే ఈ ప్రమాదం జరిగింది. 50 కిలోమీటర్ల దూరంలోని గిలిమనుక్ పోర్టుకు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. గల్లంతైన వారి ఆచూకీ కోసం సహాయక సిబ్బంది గాలిస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో అగ్నిప్రమాదం

**న్యూఢిల్లీ,జులై 3 :** ఢిల్లీలోని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. గురువారం సెంటర్ లోని ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. ఎనిమిది ÷ర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసినట్లు ఢిల్లీ సర్వీసెస్ అధికారి తెలిపారు. 'మధ్యాహ్నం 3.34 గంటలకు ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో పేలుడు సంభవించి మంటలు చెలరేగినట్లు మాకు కాల్ వచ్చింది. మేము 8 అగ్నిమాపక యంత్రాలను సంఘటనా స్థలానికి తరలించి మంటలను అదుపులోకి తెచ్చారు' అని చీఫ్ అతుల్ గార్గ్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు గానీ, ప్రాణనష్టం గానీ జరగలేదని అధికారి తెలిపారు.

# బైకును ఢీకొన్న భారీ వాహనం

## ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

**లక్నో,జులై 3 :** ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం హపూర్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హాఫీజ్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ ను భారీ వాహనం ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. మజీద్ పూర్ కు చెందిన దినేష్ తన ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, స్నేహితుడు కుమారుడితో కలిసి బైక్ పై వెళ్తుండగా భారీ వాహనం ఢీకొట్టింది. ఐదుగురు ఘటనా స్థలంలోనే చనిపోయారు. ఎఎస్ పి వినీత్ భటాగర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్విమ్మింగ్ ఫూల్ నుంచి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

# గోవిందరాజస్వామి ఆలయ సమీపంలో అగ్నిప్రమాదం

**తిరుపతి,జులై 3 :** తిరుపతిలోని గోవిందరాజుస్వామి ఆలయం సమీపంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున గోవిందరాజు స్వామి ఆలయానికి సమీపంలో ఓ దుకాణంలో మంటలు చెలరేగడంతో భక్తులు పరుగులు తీశారు. దుకాణం నుంచి చలువ పందిళ్లకు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. షాపుల్లో ఇత్తడి సామాన్లు, బొమ్మలు దగ్ధంకావడంతో ఆస్తినష్టం జరిగినట్టు సమాచారం.

# శుభమన్ గిల్ డబుల్ సెంచరీ



## బద్దలైన అనేక రికార్డులు
## 311 బంతుల్లో ద్విశతకం పూర్తి
## భారీ స్కోర్ దిశగా భారత్..
## 6 వికెట్ల నష్టానికి 515 పరుగులు

ఇంగ్లాండ్ తో జరుగుతున్న రెండో టెస్టులో శుభమన్ గిల్ డబుల్ సెంచరీ చేశారు. ఎడ్జ్‌బాస్టన్‌లో తన మొదటి టెస్ట్ డబుల్ సెంచరీ సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను అనేక రికార్డులను నెలకొల్పాడు. శుభమన్ గిల్ 311 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేశారు. 21 ఫోర్లు మరియు 2 సిక్సర్లతో ఈ స్కోరును సాధించాడు. సంయమనంతో కూడిన ఇన్నింగ్స్‌తో భారత స్కోరు పెంచుకుంటూ వెళ్లారు. గిల్ ఇంగ్లాండ్‌లో టెస్ట్ డబుల్ సెంచరీ సాధించిన మొదటి భారత కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు, ఇది ఒక అరుదైన రికార్డు. వరుసగా ఇంగ్లాండ్‌పై ధర్మశాల (2024), హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్ (2025)లో సెంచరీలు సాధించాడు. ఇది ఇంగ్లాండ్‌పై వరుసగా మూడు టెస్ట్‌లలో సెంచరీలు సాధించిన ఐదవ సందర్భంగా నమోదైంది. ఇంతకు ముందు మొహమ్మద్ అజహరుద్దీన్, దిలీప్ వెంగ్సర్కర్, రాహుల్ ద్రవిడ్ ఈ ఫీట్ సాధించారు. ఈ డబుల్ సెంచరీతో, గిల్ 25 ఏళ్లలోపు ఏడు టెస్ట్ సెంచరీలతో వీరేంద్ర సెహ్వాగ్ , రవి శాస్త్రీలతో పాటు రెండో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ (19 సెంచరీలు) అగ్రస్థానంలో ఉన్నారు. గిల్ తన కెప్టెన్సీలో మొదటి రెండు టెస్ట్ మ్యాచ్‌లలో (హెడింగ్లీ ,ఎడ్జ్‌బాస్టన్) సెంచరీలు సాధించాడు, విజయ్ హజారే (1951-52) , మొహమ్మద్ అజహరుద్దీన్ (1990) తర్వాత ఇంగ్లాండ్‌పై వంసస టెస్ట్ సెంచరీలు సాధించిన మూడవ భారత కెప్టెన్‌గా నిలిచారు. గిల్ ఎడ్జ్‌బాస్టన్‌లో టెస్ట్ సెంచరీ (డబుల్ సెంచరీ) సాధించిన రెండవ భారత కెప్టెన్‌గా నమోదయ్యాడు, ఇంతకు ముందు విరాట్ కోహ్లీ 2018లో ఈ ఫీట్ సాధించాడు. శుభమన్ గిల్ ఇప్పటికే వన్డేల్లో డబుల్ సెంచరీ చేశారు. 2023లో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో న్యూజీలాండ్‌పై జరిగిన మొదటి ODI మ్యాచ్‌లో 208 పరుగులు (149 బంతులు, 19 ఫోర్లు, 9 సిక్సర్లు) చేశారు. పురుషుల ODI క్రికెట్‌లో డబుల్ సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడిగా నిలిపింది. ఈ రికార్డు గతంలో ఇషాన్ కిషన్ (24 సంవత్సరాల 145 రోజులు, 2022లో బంగ్లాదేశ్‌పై 210) పేరిట ఉంది. పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. సెనా దేశాల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి ఆసియా కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. 2011లో లార్డ్స్ వేదికగా శ్రీలంక కెప్టెన్‌గా తిలకరత్న దిల్షాన్ 193 పరుగులు చేశాడు. ఇదే ఇప్పటి వరకు ఆసియా కెప్టెన్ అత్యధిక స్కోర్. ఇంగ్లండ్‌పై డబుల్ సెంచరీ సాధించిన తొలి భారత కెప్టెన్‌గానూ చరిత్రకెక్కాడు. ఇంగ్లండ్ గడ్డపై డబుల్ సెంచరీ బాదిన తొలి పర్యాటక జట్టు కెప్టెన్‌గా కూడా నిలిచాడు. భారత కెప్టెన్‌గా డబుల్ సెంచరీ బాదిన రెండో పిన్నవయస్కుడిగా కూడా గిల్ నిలిచాడు. గిల్ కన్నా ముందు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ(23 ఏళ్ల 39 రోజుల వయసులో) ఈ ఫీట్ సాధించాడు. పటౌడీ ఇంగ్లండ్‌తో ఢిల్లీ వేదికగా 1964లో జరిగిన మ్యాచ్‌లో డబుల్ సెంచరీ సాధించాడు. సచిన్ టెండూల్కర్(26 ఏళ్ల 189 రోజుల), విరాట్ కోహ్లీ(27 ఏళ్ల 260 రోజులు) గిల్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. మరివైపు 310/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్ భారీ స్కోర్ దిశగా సాగుతోంది. టీమిండియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు ఆట లంచ్ అనంతర సెషన్ లో భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 515 పరుగులు చేసింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా, భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ముందుండి జట్టును నడిపించాడు. ఓపికగా ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న గిల్, 340 బంతుల్లో 27 ఫోర్లు, 2 సిక్సర్లతో 234 పరుగులు చేసి అజేయంగా క్రీజులో ఉన్నాడు. అతనికి రవీంద్ర జడేజా (89), యశస్వి జైస్వాల్ (87) చక్కటి సహకారం అందించారు. వీరిద్దరూ కీలక అర్ధశతకాలతో జట్టు స్కోరును పెంచడంలో కీలక పాత్ర పోషించారు. ఆరంభంలో కేఎల్ రాహుల్ (2) వికెట్‌ను త్వరగానే కోల్పోయినా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడారు. జైస్వాల్, జడేజా ఔటైన తర్వాత, గిల్.. వాషింగ్టన్ సుందర్ (26బి)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపిస్తున్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ రెండు వికెట్లు పడగొట్టగా, బెన్ స్టోక్స్, షోయబ్ బషీర్, జోష్ టంగ్, బ్రైడన్ కార్స్ తలో వికెట్ తీశారు. భారీ స్కోరు సాధించిన టీమిండియా ఈ మ్యాచ్‌పై పట్టు బిగించింది.

## చరిత్ర సృష్టించిన రవీంద్ర జడేజా



రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) చరిత్రలో 100 వికెట్లతో పాటు 2000 పరుగులు చేసిన ఏకైక ఆటగాడిగా రవీంద్ర జడేజా నిలిచాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో హాఫ్ సెంచరీ చేయడం ద్వారా జడేజా ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో జడేజా తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. 137 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 89 పరుగులు చేశాడు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి 6వ వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. ఈ క్రమంలో డబ్ల్యూటీసీలో 2000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. 2021లో డబ్ల్యూటీసీ ప్రారంభమవ్వగా..ఇప్పటి వరకు 41 మ్యాచ్‌లు ఆడిన జడేజా 25.92 సగటుతో 132 వికెట్లు తీయడంతో పాటు 2000 ప్లస్ రన్స్ చేశాడు. మరే ఆటగాడు కూడా ఈ ఫీట్ సాధించలేదు. డబ్ల్యూటీసీలో జడేజా ఇప్పటి వరకు మూడు సెంచరీలు చేశాడు. బౌలింగ్‌లో ఆరు సార్లు 5-వికెట్ల ఘనతను అందుకున్నాడు.ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో సెంచరీ దిశగా సాగిన జడేజాను జోష్ టంగ్ షార్ట్ పిచ్ డెలివరీతో కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. 310/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్ లంచ్ బ్రేక్ సమయానికి 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. క్రీజులో శుభ్‌మన్ గిల్(168 బ్యాటింగ్)తో పాటు వాషింగ్టన్ సుందర్(1 బ్యాటింగ్) ఉన్నారు. తొలి సెషన్‌లో భారత్ 25 ఓవర్లు ఆడి ఒకే ఒక్క వికెట్ కోల్పోయి 109 పరుగులు చేసింది.

## భారీ సిక్సలతో రెచ్చిపోతున్న వైభవ్ సూర్యవంశీ



వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో ఆడుతున్నాడు. అక్కడ తనలోని మరో కోణాన్ని చూపిస్తూ, భారీ సిక్సలతో రెచ్చిపోతున్నాడు. ఈ క్రమంలో జట్టుకు విజయాలు అందిస్తూ సంచలనంగా మారాడు. అండర్ 19 సిరీస్‌లోని మూడవ వన్డేలో కేవలం 14 పరుగుల తేడాతో తన సెంచరీని కోల్పోయాడు. కానీ, ఆ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఏకంగా 24 మంది బ్యాటర్ల కంటే రెండు అడుగులు ముందున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.భారత్ యు19 వర్సెస్ ఇంగ్లాండ్ యు19 మధ్య జరుగుతున్న యూత్ సిరీస్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. ముఖ్యంగా సిక్సర్లు కొట్టడంలోనూ, తన స్ట్రైక్ రేట్‌తో ప్రత్యర్థులను భయపెడుతూ దూసుకెళ్తున్నాడు. ఈ సిరీస్‌లో అతని ప్రదర్శన, గత రికార్డులను పరిశీలిస్తే ఎంత అద్భుతంగా రాణించాడో స్పష్టమవుతుంది. రెండు జట్ల మధ్య 5 వన్డే మ్యాచ్‌ల సిరీస్ జరుగుతోంది. కాగా, ఇప్పటికే 3 మ్యాచ్‌లు ముగిశాయి. ఆ 3 మ్యాచ్‌లలో మె-ొత్తం 25 మంది బ్యాటర్లు క్రీజులో తమ బలాన్ని చూపించారు. వారిలో ఒకరు వైభవ్ సూర్యవంశీ. కానీ వైభవ్ సూర్యవంశీ దరిదాపుల్లో కూడా ఎవరూ లేకపోవడం గమనార్హం. ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో యూత్ వన్డేలో వైభవ్ సూర్యవంశీ కేవలం 31 బంతుల్లో 86 పరుగులు చేసి భారత జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను 6 ఫోర్లు, రికార్డుస్థాయిలో 9 సిక్సర్లు బాదాడు. అతని స్ట్రైక్ రేట్ ఏకంగా 277.41గా నమోదైంది. కేవలం 20 బంతుల్లోనే తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఇది భారత U19 క్రికెట్‌లో రిషబ్ పంత్ (18 బంతుల్లో) తర్వాత రెండో అత్యంత వేగవంతమైన అర్ధశతకం. తన 86 పరుగులలో 78 పరుగులు బౌండరీలు, సిక్సర్ల రూపంలోనే వచ్చాయి. ఇది అతని విధ్వంసకర బ్యాటింగ్‌కు నిదర్శనం. ఇంగ్లాండ్‌పై కొట్టిన 9 సిక్సర్లతో, వైభవ్ సూర్యవంశీ U19 వన్డేలలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన భారత బ్యాట్స్‌మెన్‌గా రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు మన్‌దీప్ సింగ్ (8 సిక్సర్లు) పేరిట ఉండేది. 20 బంతుల్లోనే అర్ధశతకం సాధించి, భారత U19 క్రికెట్‌లో రిషబ్ పంత్ తర్వాత రెండో వేగవంతమైన అర్ధశతకకారిగా నిలిచాడు. వైభవ్ సూర్యవంశీ ఈ సిరీస్‌లో ఇప్పటివరకు 179 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. అతని ప్రస్తుత సిరీస్ స్ట్రైక్ రేట్ 213.09. మిగిలిన ఏ భారత %ఖ%19 బ్యాట్స్‌మెన్ కూడా సిక్సర్ల సంఖ్యలో లేదా స్ట్రైక్ రేట్‌లో వైభవ్ సూర్యవంశీకి దరిదాపుల్లో కూడా లేరు. అతని దూకుడైన ఆటతీరు, బౌండరీలు కొట్టే సామర్థ్యం, ముఖ్యంగా సిక్సర్లతో స్కోరు వేగాన్ని పెంచడం అతన్ని ప్రత్యేకంగా నిలబెడుతోంది. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఇటువంటి అద్భుతమైన ప్రదర్శనలు ఇస్తున్న వైభవ్ సూర్యవంశీ, భారత క్రికెట్‌కు ఒక గొప్ప ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు. అతని అసాధారణ బ్యాటింగ్ సామర్థ్యం, సిక్సర్లు కొట్టే నైపుణ్యం చూస్తుంటే, అతను త్వరలోనే సీనియర్ జట్టులో చోటు దక్కించుకునే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



## లైవ్ మ్యాచ్‌లో పాము ప్రవేశం

శ్రీలంక క్రికెట్ జట్టు బుధవారం జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టును 77 పరుగుల తేడాతో ఓడించింది. ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మైదానంలోకి సుమారు 6 అడుగుల పొడవున్న పాము దూసుకురావడంతో కలకలం రేగింది. ఈ సమయంలో ఆటగాళ్లు మైదానంలో ఆడుతున్నారు. ఈ క్రమంలో పామును చూసి అందరూ ఆగిపోయారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.శ్రీలంక జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. పేలవమైన ఆరంభం తర్వాత కుశాల్ మెండిస్ (45) మంచి ఇన్నింగ్స్ ఆడగా.. కెప్టెన్ చరిత్ అసలంక అద్భుతమైన సెంచరీ సాధించాడు. అసలంక 106 పరుగుల ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు, 6 ఫోర్లు కొట్టాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు 244 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ మూడో ఓవర్ సందర్భంగా ఈ పాము మైదానంలోకి ప్రవేశించింది. దీనిని కెమెరాలో బంధించారు. మైదానంలో పాకుతూ వస్తున్న ఈ పాము పిచ్ వైపు వేగంగా కదిలింది. దీంతో మ్యాచ్‌ను కొంతసేపు నిలిపివేయాల్సి వచ్చింది. ఇంతకు ముందు కూడా శ్రీలంకలో ఈ తరహా పాము మైదానంలోకి ప్రవేశించింది. కొన్ని రోజుల క్రితం ఒక మ్యాచ్ సందర్భంగా పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కూడా కెమెరాకు చిక్కాడు. 245 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ జట్టుకు మంచి ఆరంభం లభించింది. తంజీద్ హసన్(62), నజ్ముల్ హుస్సేన్ శాంటో(23) నిలకడైన ఇన్నింగ్స్‌తో బంగ్లాదేశ్ ఒక వికెట్ నష్టానికి 100 పరుగులు చేసింది. కానీ నజ్ముల్ రనౌట్ అయిన తర్వాత మొత్తం జట్టు కుప్పకూలింది. 100 పరుగులకు కేవలం ఒక వికెట్ కోల్పోగా.. అది 125/9గా మారింది. చివరికి అలీ కొంతసేపు పోరాడి అర్ధ సెంచరీ(51) సాధించినా అది సరిపోలేదు. శ్రీలంక క్రికెట్ జట్టు మొదటి వన్డేను 77 పరుగుల తేడాతో గెలుచుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండో వన్డే శనివారం, జూలై 5న జరగనుంది. సిరీస్‌లో చివరి మ్యాచ్ జూలై 8న ఉంటుంది.

## ఫుట్‌బాల్ ప్లేయర్ డియోగో జోటా మృతి





స్పెయిన్‌లోని జమోరా ప్రావిన్స్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు డియోగో జోటా గురువారం మృతి చెందాడు. మార్కా నివేదిక ప్రకారం సనాబ్రియాలోని జమోరా ప్రాంతానికి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. పోర్చుగల్‌లోని పెనాఫీల్‌కు చెందిన డియోగో జోటా తన సోదరుడు ఆంద్రీతో కలిసి ట్రావెల్ చేస్తున్న టైంలో ప్రమాదం జరిగింది. వారు వెళ్తున్న క్రమంలోనే కారు ప్రమాదానికి గురైంది. కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ మంటల ధాటికి చుట్టుపక్కల ప్రదేశం కూడా ఎఫెక్ట్ అయినట్టు స్థానికులు చెబుతున్నారు. డియోగో జోటాకు పది రోజుల క్రితమే రూట్ కార్డోసోతో వివాహమైంది. డైలీ మెయిల్ ప్రకారం, కాస్టిల్లా, లియోన్ ప్రాంతంలోని పోలీసు వర్గాలు కూడా ఈ ప్రమాదాన్ని నిర్ధారించాయి. "జమోరాలోని సెర్నాడిల్లా మునిసిపాలిటీలోని %ూ%-52 65 కి.మీ. వద్ద వాహనం ప్రమాదానికి గురైనట్టు 1-1-2 కాస్టిల్లా వై లియోన్ ఆపరేషన్స్ రూమ్‌కు చాలా కాల్స్ వచ్చాయి. కారు ప్రమాదంలో చిక్కుకొని కాలిపోయినట్లు చెప్పారు" అని ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. "అక్కడి నుంచి, మోంబుయ్ హెల్త్ సెంటర్ నుంచి మెడికల్ ఎమర్జెన్సీ యూనిట్, ప్రైమరీ కేర్ మెడికల్ స్టాఫ్ ప్రమాద స్థలానికి చేరుకున్నారు. స్పాట్‌లోనే ఇద్దరు వ్యక్తుల మరణించినట్టు నిర్ధారించారు." పోర్చుగీస్ ఫుట్‌బాల్ సమాఖ్య చీఫ్ పెడ్రో ప్రోయెంకా ఈ ఘటనపై స్పందించారు. "ఈ ఉదయం స్పెయిన్‌లో డియోగో జోటా, ఆంద్రీ సిల్వా మరణించారని తెలిసింది. ఇది పోర్చుగీస్ ఫుట్‌బాల్ సమాఖ్య, మొత్తం పోర్చుగీస్ ఫుట్‌బాల్‌కు తీరని నష్టం." అని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. "చాలా కాలంగా డియోగో జోటా అద్భుతమైన ఆడగాడు. జాతీయ %ూ% జట్టుకు దాదాపు 50కుపైగా ట్రోఫీలు అందించాడు. డియోగో జోటా ఒక అసాధారణ వ్యక్తి, అన్ని సహచరులు, ప్రత్యర్థులను గౌరవించేవాడు. నా తరపున, పోర్చుగీస్ ఫుట్‌బాల్ సమాఖ్య తరపున, డియోగో, ఆంద్రే సిల్వా కుటుంబ సభ్యులు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను."అని అన్నారు. జూన్ 28న రూట్ కార్డోసోను జోటా వివాహం చేసుకున్నారు. ఇంతలోనే ఈ ప్రమాదం జరగడం అతను ప్రాణాలు కోల్పోవడం ఆయన కుటుంబ సభ్యులను, అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

# పులిని వేటాడే బెబ్బులి

## అదిరిపోయేలా హరిహరవీరమల్లు ట్రైలర్

పవన్ ఫాన్స్‌కు పండగే పండగ. హరిహర వీరమల్లు థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేశారు. దాదాపు మూడు నిమిషాల నిడివితో వచ్చిన ఈ ట్రైలర్ పవన్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ పట్టేలా.. విజువల్ ట్రీట్ ఇచ్చేలా ఉంది. మేకర్స్ ముందు నుంచి చెబుతున్నట్టుగా.. అద్భుతమైన విజువల్స్‌తో హరిహర వీరమల్లు ట్రైలర్ అదిరిపోయింది. మూడే మూడు డైలాగ్స్‌తో సినిమా కథను చెప్పేశారు. హిందువుగా జీవించాలంటే పన్ను కట్టాల్సిన సమయం, ఈ దేశ శ్రమ బాద్‌షా పాదాల కింద నలిగిపోతున్న సమయం, ఒక వీరుడు కోసం ప్రకృతి పురుడు పోసుకుంటున్న సమయం.. అంటూ మొఘలులను ఎదురించిన వీరుని కథే హరిహర వీరమల్లు కథ అని చెప్పేశారు. కోహినూర్ డైమండ్ అంటూ పవన్‌కి ఇచ్చిన ఎలివేషన్ పీక్స్ అనే చెప్పాలి. పవర్ స్టార్ చెప్పిన డైలాగ్స్ బాగున్నాయి. పులిని వేటాడే బెబ్బులిని చూస్తారు అంటూ.. పవన్ చెప్పిన డైలాగ్ విజిల్స్ వేసేలా ఉంది. అలాగే.. మన దేశ ప్రధాని మోదీ పవన్ గురించి చెప్పిన 'యే పవన్ నహీ ఆంధీ హై' డైలాగ్‌ను ట్రైలర్‌లో హైలెట్ చేశారు. విలన్ బాబీ డియోల్ చేత.. ఆంధీ వచ్చేసింది అంటూ ఎలివేషన్ ఇచ్చారు. ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్‌ను పవర్ ఫుల్‌గా చూపించారు. ఇక పవన్ లుక్, యాక్షన్, విజువల్ పరంగా ట్రైలర్ అదరహో అనేలా ఉంది. కాకపోతే.. కొన్ని ఫ్రేమ్స్‌లో సీజీ వర్క్ పై ఇంకాస్త దృష్టి పెట్టాల్సింది. కానీ పీరియాడికల్ సెటప్ మాత్రం అదిరిపోయింది. నిర్మాత ఏఎం.రత్నం పెట్టిన బ్జడెట్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తోంది. హీరోయిన్ నిధి అగర్వాల్‌కు మంచి పాత్ర పడినట్టుగా ఉంది. ఆస్కార్ విన్నర్ ఎంఎం. కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. మె-ుత్తంగా.. పవన్ ఫ్యాన్స్‌ను మెప్పించేలా ఉంది ఈ ట్రైలర్. ఇక్కడితో సినిమా పై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. వీరమల్లు విధ్వంసం ఎలా ఉంటుందో చూడ్డానికి ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు అభిమానులు. మరి హరిహర వీరమల్లు ఎలా ఉంటుందో తెలియాలంటే.. జులై 24 వరకు వెయిట్ చేయాల్సిందే



# రామాయణం ఎప్పటికీ ఆదరణీయ కావ్యం

## బాలీవుడ్ రామాయణ గ్లింప్స్ విడుదల

యుగాలు మారినా.. తరాలు మారినా.. విన్న ప్రతిసారీ భక్తిభావంతో ఓలలాడించే కావ్యం రామాయణం. ఇప్పుడీ కథను బాలీవుడ్ 'రామాయణ' సినిమాగా మన ముందుకు తెస్తోంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి రావణుడిగా యశ్ నటించిన 'రామాయణ' గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేసింది. 'ముల్లోకాలను త్రిమూర్తులు పరిపాలిస్తున్నారు. బ్రహ్మ.. సృష్టించే దేవుడు; విష్ణువు.. రక్షించే దేవుడు; శివుడు.. అంతం చేయగలిగే దేవుడు. కానీ, వారు సృష్టించిన మూడు లోకాలపై ఆధిపత్యం కోసం ఎదురు తిరిగినప్పుడు అన్ని యుద్ధాలను అంతం చేసే యుద్ధం ప్రారంభమైంది. 5వేల సంవత్సరాల నుంచి 2500 కోట్ల మంది ప్రజలు ఆరాధించేది. ఇది ఒక అమరమైన ఇతిహాసగాథ.. రామాయణం మన వాస్తవం.. మన చరిత్ర' అంటూ గ్లింప్స్‌ను పంచుకుంది. ఇక ఇందులో లక్ష్మణుడిగా రవి దుబే, హనుమంతుడిగా సన్నీ డేఓల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్ పై ఎన్నో రామాయణ కథలు సినిమాలుగా వచ్చి సూపర్ హిట్ గా నిలిచాయి. ఇంకా మరెన్నో సినిమాలు వస్తూనే ఉంటయి. అందుకే రామాయణం ఎపిక్. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా బాలీవుడ్ లో రామాయణ ఇతిహాసంలో 'రామాయణ' అనే సినిమా వస్తుంది. ఇక ఈ కథలో కీలకమైన రావణాసురిడి పాత్రలో కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్నాడు. ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా స్టార్ట్ అయిన ఈ సినిమా షూటింగ్ చకచక జరుగుతోంది. కానీ ఈ సినిమాకు సంబంధించి కనీసం ఒక పోస్టర్ ను కూడా రిలీజ్ చేయలేదు మేకర్స్. రణబీర్ రాముడు పాత్రలో నటిస్తుండడంతో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఇన్ని రోజులు ఈ సినిమా ఎలా ఉంటుందా అని ఎదుచూసిన మేకర్స్ చిన్న పాటి గ్లిమ్స్ తో వీడియో రిలీజ్ చేసారు. ఎవరెవరు ఏ ఏ పాత్రలు పోషిస్తున్నారో తెలియాజేస్తూ చివరిలో యష్ ను లుక్ ను చూపిస్తూ ఎండ్ లో రాముడుగా రణబీర్ ఎంట్రీ ఫ్రేమ్ ఓ రేంజ్ లో ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే రామయణ ఇంట్రడక్షన్ ఊహించిన దానికి మించి ఉండబోతుందని తెలుస్తోంది. ఏ ఆర్ రెహమాన్ మ్యూజిక్ టాప్ క్లాస్ ఉంది. భారీ బ్జడెట్ పై తెరకెక్కుతున్న ' రామాయణ' ఫస్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళి కానుకగా రిలీజ్ కానుంది. సెకాండ్ పార్ట్ ను 2027 దీపావళికానుకగా రిలీజ్ చేస్తామని తెలిపారు.

# మాళవిక ఇలా కూడా భలే ఉందే

టాలీవుడ్‌లో రాజాసాబ్ సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్న ముద్దుగుమ్మ మాళవిక మోహనన్. ఈమె ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం అవుతుంది. పలు సార్లు తెలుగు సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చాయట. కానీ పెద్ద సినిమాతో ఎంట్రీ ఇవ్వాలనే ఉద్దేశంతో ఇన్నాళ్లు వెయిట్ చేసింది. ఇన్నాళ్ల ఎదురు చూపులకు ఫలితం దక్కింది. బాలీవుడ్‌లోనూ పాపులారిటీ సొంతం చేసుకునే విధంగా రాజాసాబ్ సినిమాలో కనిపించబోతుంది. ఇటీవల విడుదలైన రాజాసాబ్ టీజర్‌లో మాళవిక మోహన్ పాత్ర అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కాస్త హ్యూమర్ ఉన్న పాత్రగా తెలుస్తోంది. తప్పకుండా మాళవిక టాలీవుడ్‌లో సాలిడ్ ఎంట్రీ ఇవ్వబోతుంది. సినిమాలతో పాటు అందాల ఆరబోత ఫోటో షూట్స్‌తో ఎప్పుడూ వార్తల్లో ఉంటుంది. సోషల్ మీడియాలో 43 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న మాళవిక మోహన్ రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఎక్కువగా స్కిన్ షో ఫోటోలు షేర్ చేయడంతో చాలా మంది ఈమెను అలాగే ఇష్టపడుతూ ఉంటారు. మాళవిక స్కిన్ షో చేస్తేనే బాగుంటుంది అంటూ చాలా మంది కామెంట్ చేస్తూ ఉంటారు. కానీ తాజాగా ఈమె లిఫ్ట్‌లో దిగిన సెల్ఫీని షేర్ చేసింది. స్కిన్ షో చేస్తేనే కాకుండా ఇలా సింప్లీ సూపర్ లుక్‌తోనూ మాళవిక మోహనన్ ఆకట్టుకుంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ఫోటో వైరల్ అవుతోంది.







# శ్రీలీల మరోసారి సై అంటుందా?

కన్నడ ఇండస్ట్రీలో కెరీర్ ను స్టార్ట్ చేసిన శ్రీలీల, దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన పెళ్లి సందడి సినిమాతో టాలీవుడ్ కు పరిచయమయ్యారు. మొదటి సినిమాతోనే యాక్టింగ్, తన డ్యాన్సులతో ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేసిన శ్రీలీల ఆ తర్వాత రవితేజకు జోడీగా ధమాకా సినిమాలో నటించి బ్లాక్ బస్టర్ ను తన ఖాతాలో వేసుకున్నారు. ధమాకా తర్వాత శ్రీలీల వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఎన్నో సినిమాల్లో నటించి తక్కువ టైమ్ లోనే స్టార్ హీరోయిన్ గా క్రేజ్ సంపాదించుకున్నారు. ప్రస్తుతం శ్రీలీల కేవలం టాలీవుడ్ లోనే కాకుండా బాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తున్నారు. స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ తో కలిసి బాలీవుడ్ ఎంట్రీకి రెడీ అయిన శ్రీలీల క్రేజ్ ఇప్పుడు ఓ రేంజ్ లో ఉంది. ఇవన్నీ ఒకెత్తయితే ఓ వైపు హీరోయిన్ గా బిజీగా ఉంటూనే పుష్ప2 సినిమాలో అల్లు అర్జున్ సరసన కిస్సిక్ సాంగ్ చేసి నేషనల్ వైడ్ పాపులైరయ్యారు శ్రీలీల. ఇంకా చెప్పాలంటే కిస్సిక్ సాంగ్ చేశాక శ్రీలీల క్రేజ్, మార్కెట్ మరింత పెరిగాయని చెప్పొచ్చు. ఆల్రెడీ పుష్ప2 లో చేసిన స్పెషల్ సాంగ్ తనకు మంచి గుర్తింపును ఇవ్వడంతో ఇప్పుడు శ్రీలీల మరో స్పెషల్ సాంగ్ చేయడానికి రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. యువ సామ్రాట్ అక్కినేని నాగ చైతన్య, విరూపాక్ష ఫేమ్ కార్తీక్ దండు కలయికలో ఓ మిస్టిక్ థ్రిల్లర్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందని, ఆ సాంగ్ ను టాలీవుడ్ హ్యాపెనింగ్ హీరోయిన్ శ్రీలీలతో చేయించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ నిజంగా శ్రీలీల ఈ సాంగ్ చేస్తే సినిమాకు ఈ సాంగ్ చాలా ప్లస్సయ్యే ఛాన్సుంది. మరి ఈ వార్తల్లో నిజమెంతన్నది తెలియాల్సి ఉంది.

# SSMB29 గురించి చోప్రా ఉత్సాహం

అమెరికా కోడలు ప్రియాంక చోప్రా ఓ వైపు హాలీవుడ్ లో నటిస్తూనే, మరోవైపు భారతీయ సినిమాల్లో నటించేందుకు ప్లాన్ ని సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. హిందీ చిత్రసీమలో తనకు అవకాశాలు రానివ్వకుండా కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయని బహిరంగంగా వెల్లడించిన పీసీ ఆ తర్వాత దక్షిణాదిన అతిపెద్ద పరిశ్రమ టాలీవుడ్ లో పెద్ద అవకాశం దక్కించుకుంది. సూపర్ స్టార్ మహేష్- దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్ లో ఎస్.ఎస్.ఎం.బి 29లో నటిస్తోంది. అయితే ఈ సినిమాలో ప్రియాంక చోప్రా నటిస్తున్నట్టు ఇప్పటివరకూ రాజమౌళి బృందం అధికారికంగా ధృవీకరించలేదు. కానీ తాజాగా ఇండియా టుడేతో ఇంటర్వ్యూలో.. తాను ఎస్.ఎస్.రాజమౌళి సినిమాలో నటిస్తున్నానని పీసీ అధికారికంగా ధృవీకరించింది. ఇటీవల విడుదలైన 'హెడ్స్ ఆఫ్ స్టేట్' సినిమాను ప్రమోట్ చేస్తున్నప్పుడు చాలా కాలంగా హిందీ చిత్రసీమకు దూరంగా ఉండటం గురించి మాట్లాడింది. "నేను హిందీ సినిమాలు మిస్ అవుతున్నాను.. ఇండియాను చాలా మిస్ అవుతున్నాను" అని పీసీ వ్యాఖ్యానించింది. ప్రస్తుతానికి భారతదేశంలో ఓ సినిమాలో నటిస్తున్నాని ప్రియాంక చోప్రా వెల్లడించింది. రాజమౌళి - మహేష్ లతో ఎస్.ఎస్.ఎం.బి 29లో నటిస్తున్నాను.. ఈ సినిమా విడుదల కోసం నిజంగా చాలా ఉత్సాహంగా ఉన్నానని ప్రియాంక చోప్రా వెల్లడించింది. ఇక ఈ సినిమా కథాంశం ప్రకారం.. మెజారిటీ భాగం దట్టమైన అడవుల్లో తెరకెక్కిస్తున్నారు. కెన్యాలోని డీప్ ఫారెస్ట్ లోను ఈ సినిమాని చిత్రీకరించాల్సి ఉందని కూడా తెలుస్తోంది. ఇది యాక్షన్ అడ్వెంచర్ డ్రామా కేటగిరీలో అద్భుతాలు చేస్తుందని నమ్ముతున్నారు. ఈ చిత్రాన్ని అన్ని భారతీయ భాషలు సహా ఆంగ్లంలోను విడుదల చేస్తారని కథనాలొస్తున్నాయి. చిత్రబృందం అధికారికంగా మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463